## అధ్యాయము 12

# కనాను దేశము వెళ్లుటకు అబ్రాహాముకు పిలుపు

లోకములోని మానవ పాప ఫలితంగా మనుష్యులపై దేవుని శిక్ష జలప్రళయ రూపంలో వచ్చినదానిని గూర్చిన వివరణలను అనుసరించి (1–11 అధ్యాయములు), ఆదికాండము యొక్క రెండవ ప్రాముఖ్య భాగము దృష్టిని కేంద్రీకరిస్తుంది (12–50 అధ్యాయములు). ఏదేను వనములో మానవుడు చేసిన తిరుగుబాటుకు శాపమును ప్రకటించిన దేవుడు ఆ శాపమును తిరగబెట్టు ప్రణాళికను ఉపయోగించుట ఆరంభించాడు. తన నిబంధన ప్రజలైన ఇశ్రాయేలు దేశమును స్థాపించుటకు అబ్రాహాము, ఇస్సాకు మరియు యాకోబుల ద్వారా పని చేయుట ఆరంభించాడు. ఈ మానవ వంశావళి ద్వారా మెస్సీయ అవరోహించవలసియుంది.

12వ అధ్యాయము దేవుడు అబ్రాహామును పిలచుటను గూర్చి మరియు అబ్రాహాముతో దేవుడు చేసిన వాగ్దానమును గూర్చి తెలియజేస్తుంది. అబ్రాహాము యిష్టపూర్వకముగా పిలుపునకు స్పందించి వాగ్దాన దేశమైన కనానుకు వెళ్లుటను నివేదిస్తుంది. అధ్యాయ ముగింపులో కరువు కారణాన అబ్రాహాము ఐగుప్తుకు ప్రయాణం చేసి అక్కడ నివసించుటను సూచిస్తుంది. పితరులు మోసము చేసినప్పటికీ దేవుడు వారి కుటుంబమును కాపాడి, సంరక్షించి ఆయన వాగ్దానములను నిలవబెట్టుకోవడాన్ని తెలియజేస్తుంది.

### అబ్రాహాము పిలుపు (12:1–3)

**1యెహోవా–నీవు లేచి నీ దేశమునుండియు నీ బంధువుల యొద్దనుండియు నీ తండ్రి యింటినుండియు బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్లుము. 2నిన్ను గొప్ప జనముగా చేసి నిన్ను ఆశీర్వదించి నీ నామమును గొప్ప చేయుదును, నీవు ఆశీర్వాదముగా నుందువు. నిన్ను ఆశీర్వదించువారిని**

**ఆశీర్వదించెదను; [3]నిన్ను దూషించువాని శపించెదను; భూమియొక్క సమస్తవంశములు నీయందు ఆశీర్వదించబడునని అబ్రాముతో అనగా.**

**వచనము 1.** దేవుడు అబ్రామును ముందుగానే పిలిచాడు అని ఆదికాండము రచయిత తీసుకున్నాడు (11:31 చూడుము): దక్షిణ మెసొపొతమియాలోని ఊరు అను ప్రాచీన గ్రామం నుండి అబ్రామును దేవుడు పిలిచెను. ఇది ఆదికాండము 15:7లో అదేవిధంగా నెహెమ్యా 9:7లో మరియు అపొస్తలుల కార్యములు 7:2–4లో చెప్పబడింది. అబ్రాహామును దేవుడు హారానును విడిచిపెట్టమని పిలిచిన సమయములో, పితరులు అనేక సంవత్సరములు జీవించి దానిని వారి సొంత దేశముగా భావించిరి. అందుచేత, **దేవుని ఆజ్ఞార్థం అబ్రాముస్వదేశమును, బంధువులను మరియు తండ్రి ఇంటిని విడిచి** దేవుడు **చూపించు భూభాగమునకు** వెళ్లుటకు కారణమయ్యింది. ఈ పిలుపులో అబ్రాము ప్రయాణమునకు కావలసిన దేవుని సూత్రములు అన్ని యిమిడియున్నవి. ఈ పిలుపులోఉన్న పదజాలం సామాన్యస్థితి నుండి ప్రాముఖ్యస్థితికి నడిపినది, ఇది కుటుంబం నుండి పూర్తిగా వేరుపరచడాన్ని సూచిస్తుంది. మొదట, ఆయన దేశములో హారాను చుట్టూ ఉన్న ప్రదేశమంతా ఇమిడి ఉన్నది. రెండవదిగా, ఆయన బందువర్గమైన జాతి సముదాయాన్ని సూచిస్తుంది. చివరుగా, అబ్రాహాము "తండ్రి ఇల్లు" అనేది 11:27–32లో గల వంశవృక్షంలో ఉన్న తెరహు యొక్క ఉమ్మడి కుటుంబమును సూచిస్తుంది. తన దేశమును, బంధువులను మరియు తండ్రి యింటిని విడిచిపెట్టడం అంటే వారసత్వ హక్కులను, పిత్రార్జితమైన ఆస్తిని విడిచిపెట్టడమే.

ఆజ్ఞార్థకమైన పదం "వెళ్లు" అనేది ఆత్మార్థక సర్వనామం (לֶךְ־לְךָ, *lek-l$^e$ka*) వాడుట ద్వారా వక్కాణించబడింది, అందుచేతనే అక్షరార్థంగా "నీవుగా వెళ్లుము" అని అర్థము.[1] అబ్రాహాము గుర్తించదగిన విషయమేమనగా ఊరు అనే గ్రామంలో వారి బంధువులను విడిచిపెట్టుమని దేవుడు మొదట పిలిచినప్పటికినీ, వారు ఏదో విధంగా హారానును వరకు ఆయనతో వచ్చారు. "నీకు నీవుగా ళ్లు"[2] అని మరింత ఖచ్చితంగా అనువదించవచ్చును. ఆయనలో నుండి వచ్చు "గొప్ప దేశము" కొరకు దేవుడు ప్రత్యేకపరచిన భూమి ఆయన గమ్యమని చెప్పు ఘోషణ కొరకు ఈ వివరణ పితరుని సిద్ధపరచియుండవచ్చు (12:2, 7).

అబ్రాహాము దైవజనుడని గుర్తింపుపొందునట్లు సొంత బంధువులను విడిచిపెట్టుమని దేవుడు ఇచ్చిన ఆజ్ఞ యొక్క అర్థము. కుటుంబ వత్తిడి లేకుండా, ఇబ్బంది లేకుండా దేవుని ప్రణాళిక అబ్రాహాము విషయంలో నెరవేరాలంటే, విధేయతతో కూడిన విశ్వాసంలో నడవాలి, అయనకున్న ఒకే రహదారి దిక్సూచి అయిన దేవుని నమ్మాలి మరియు ఆయనను వెంబడించి వాగ్దాన దేశం చేరాలి. హెబ్రీ రచయిత చెప్పాడు, "విశ్వాసమును బట్టి ... బయలువెళ్లెను, ఎక్కడికి వెళ్లవలెనో అది ఎరుగక బయలువెళ్లెను" (హెబ్రీ 11:8).

**వచనము 2**. దేవుడు ఆరు భాగముల వాగ్దానమును దైవిక పిలుపుతో మద్దతు పలికెను మరియు అబ్రాహాముతో ఈ విధముగా చెప్పుట ప్రారంభించెను, **నిన్ను గొప్పజనముగా చేసెదను** (18:18; 21:18; 46:3 చూడుము). ఈ వాగ్దానము నమ్ముటకు చాల కష్టతరమైనది. ఎందుకనగా, పితరుడు అప్పటికే డెబ్బై ఐదు సంవత్సరాల వయస్సు మరియు అతనికి అరవై ఐదు యేండ్ల వయస్సు గల గొడ్రాలైన ముదుసలి భార్య వుండెను; ఆమె గర్భం ధరించి ఒక బిడ్డకు కూడా జన్మనిచ్చె శక్తి లేనిదిగా ఉండెను (11:30). ఈ పిలుపునకు సంబంధించినటువంటి ప్రతిదీ దేవుడు అబ్రాహామునకు వాగ్దానము చేసినట్లు “అదృశ్యమైన” వాటిపైన మరియు “అదివరకు చూడని సంగతులు” గూర్చిన (వారసుల) విశ్వాసమును కోరుచున్నది (హెబ్రీ. 11:1, 6–10 చూడండి, NJB).

“గొప్పజనముగా“ చేసెదను అని దేవుడు అబ్రాహాముతో వాగ్దానము చేసిన తరువాత, సామాన్య స్వభావసిద్ధమైన వాగ్దానమును ఇచ్చెను: **నిన్ను ఆశీర్వదించెదను**. 2 మరియు 3 వచనములలోనే ఆశీర్వాద వాగ్దానము విశేషమైనది. ఐదు సార్లు, క్రియగా లేక నామవాచకంగా వాడబడినది. “దీవెన” అనే క్రియా పదం (בָּרַךְ, *barak*) పాతనిబంధనలో ఉన్న అన్ని పుస్తకముల కంటే ఆదికాండములో ఎక్కువగా వాడబడినది. ఈ సందర్భాన్ని ఆధారం చేసుకొని దేవుడు అనేక విధాలుగా వాని ప్రజలను దీవించాడు, ఎట్లనగా: అభివృద్ధి, ఆరోగ్యం, దీర్ఘాయువు, సమాధానం, మంచి పంట, బిడ్డలకు జన్మనిచ్చే శక్తి మొదలగునవి.

వంశపర ఆశీర్వాదం రెండవమాట అయితే, **నీ నామము గొప్పచేసెదను** అనే మాట దేవుడు కలిపాడు. ప్రాచీన పశ్చిమ ఆసియాలో రాజరిక శిలా ఫలకములపై రాజులకు బిరుదులివ్వుట, స్తుతించుట, వారిని గొప్పచేయుట సామాన్య విషయమే. దీనికి సమాంతరముగా దావీదుకు దేవుడు వాగ్దానం చేసాడు: “లోకములోని ఘనులైన వారికి కలుగు పేరు నీకు కలుగచేసి యున్నాను” (2 సమూ. 7:9).

అబ్రాహాము “పేరును గొప్ప” చేస్తానను దేవుని వాగ్దానం, ఆయన దగ్గరనున్నవారికి మరియు దూరంగానున్నవారికి ప్రాముఖ్యంగా రాబోవు తరములకు ఆయన విశ్వాసులకు తండ్రిగా ప్రతిజ్ఞ చేస్తుంది (రోమా. 4:16). ఈ గొప్ప పేరు అనే ఆలోచన ఆదికాండము 6:4లోని గోపురము కట్టు దుష్టులైన “ఖ్యాతిగల ప్రజల” యొక్క ప్రఖ్యాతికి, 11:4 ప్రకారముగా దేవునిపై తిరుగుబాటు చేసి వారికోసం గొప్ప “పేరు” తెచ్చుకోవాలన్న ఆకాంక్షకు వ్యతిరేకముగా ఉన్నది. ఈ గొప్ప పేరు అబ్రాహాము ఏదోవిధంగా, తనకు తానుగా సంపాదించుకున్నది కాదు. అబ్రాహామును రూపించుటలో మరియు వాడుకొనుటలో ఇది దేవుని బహుమానము మరియు ఆయన దివ్య పని యొక్క ఫలితం. ప్రపంచం కోసం దేవుని యొక్క దివ్య ప్రణాళిక నేరవేర్చబడడంలో ఒక భాగంగా కావాలని అబ్రాహాము ఒక “అర్థమైన పాత్రగును” (2 తిమోతి. 2:20, 21).

తరువాత వాగ్దాన భాగము, **నీవు ఆశీర్వాదముగా నుందువు**, సామాన్యంగా ఇది మొదటి వచనమును కొనసాగిస్తుంది. ఇది అనేక విధాలుగా వ్యాఖ్యానించబడెను. అబ్రాహాముకు ఇవ్వబడిన గొప్ప పేరు భవిష్యత్తులో ఆశీర్వాదములలో పేర్కొనబడుతుందని కొందరు దావా చేసారు (NEB). ఆయన ఉదాహరణను అనుసరించినవారు తన పేరును ఐశ్వర్యమునకు మరియు ఆనందమునకు ఉదాహరణగా జ్ఞాపకం చేసుకుంటారని మరికొందరు భావించారు. ఇది కేవలం లోకం యొక్క భవిష్యత్తు ఆశీర్వాదాలకు వాగ్దానం మాత్రమే అని చెప్పి, 3వ వచనము చివరి భాగములో దేవుడు చెప్పబోవు మాటను ముందు చూపిస్తారు.

హెబ్రీ భాషలో "నీవు" అనే పదం ద్వితీయా విభక్తి పుంలింగం ఏకవచనంలో ఉంది. అబ్రాహామును "ఆశీర్వాదముగా ఉండుము"[3] అని ఆదేశించే రూపములో ఉందన్న విషయాన్ని ఈ వివరణలన్ని నిగూఢపరుస్తున్నాయి. కాబట్టి, ఇది అబ్రాహాము పొందుకొనవలసిన ఆశీర్వాదము (గొప్ప పేరు) కాదు, అలా అని ఆయన నామము పేరిట ఇతరులు పలకవలసిన ఆశీర్వాద వచనముగా కూడా దేవుడు దీనిని పరిగణించలేదు. ఇంకా, అబ్రాహాము యొక్క సంతానము ఒక దినమున తమ పితరుడు ఆనందించిన వృద్ధిని జ్ఞాపకము చేసికొని వారివారి జీవితాలలో అటువంటి ఆశీర్వాదములను అదే ప్రయోజనాలను ఎదురుచూచుటకు చేయబడిన ప్రవచనము ఇది కాదు. తన చుట్టూ ఉన్న వారికి "ఆశీర్వాదము"గా అబ్రాహాము ఉండవలెనని ఆయనకియ్యబడిన ఒక ఆదేశము. దేవుడు వ్యక్తులను లేదా దేశములను ఆశీర్వదించినప్పుడు, అట్టి వరములు దేవుడు ఒక స్వలాభముగా ఇవ్వలేదు; మరియు ఈ వరములు అంతర్గతముగా చేసుకోకూడదు. ఆశీర్వదించబడిన వారు తమ జీవితములలో ఎదుర్కొనే ప్రజలకు "ఆశీర్వాదము"గా ఉండుటకు ప్రయత్నించులాగున వారు గ్రహించవలెనని దేవుడు ప్రతిగా కోరుతున్నాడు.

**వచనము 3.** మూడు వివరణములలో మరో వివరణముతో దేవుడు కొనసాగించెను, **నిన్ను ఆశీర్వదించు వారిని ఆశీర్వదించెదను** అను మాటతో మొదలుపెట్టెను. ఈ విధమైన మాటలు తరువాత ఇస్సాకు తనకు తెలియకుండా ఏశావు అనుకొని యాకోబును దీవించినప్పుడు ఉపయోగింపబడెను (27:29). ఇశ్రాయేలు జనాంగంపై దీవెననే పలుకమని బిలాముకు దేవుడు సెలవిచ్చినప్పుడు, ఈ మాటలు మరో పర్యాయం బిలాము పలికెను (సంఖ్యా. 24:9). చివరి రెండు సందర్భాలలో ఇవ్వబడిన ఆశీర్వాదములు వ్యక్తిగతమైనవి, అవి "నిన్ను దీవించువారు" మరియు "నిన్ను దీవించు ప్రతివానిని." వీటికి విరుద్ధంగా దేవుడు అబ్రాహామును "నిన్ను ఆశీర్వదిస్తాను" అని వాగ్దానము చేసినప్పుడు ప్రథమా విభక్తి వాడెను. దేవుని యొక్క మాటలు ఆయనకు మరియు పితరులకు మధ్యనున్న సాన్నిహిత్య సంబంధమును మరియు దేవునికి

అబ్రాహాముపై ఉన్న శ్రద్ధను వక్కాణించుటకు పరుస్తున్నాయి. అబ్రాహాముతో ఎవరైతే సత్సంబంధం కలిగియుంటారో, వారిని దేవుడు దీవిస్తాడు.

తరువాత **నిన్ను ధూషించువాని శపించెదను** అని దేవుడు చెప్పెను. ముందు చేసిన వాగ్దానమునకు విరుద్ధంగా, ఎవరైనను అబ్రాహామును ధూషించిన యెడల వారు దేవునిచే శపించబడతారు ఎందుచేతననగా, లోకానికి ఆశీర్వాద సాధనముగా ఎన్నుకొనబడిన వారితో సరియైన సంబంధం లేనందువలన. శత్రువులు అబ్రాహామును పలు విధములుగా శపించవచ్చును: ఆయనను గూర్చి చెడ్డ మాటలు పలికి, ఆయన కీర్తిని తక్కువగా చేయుట ద్వారా, ఆయనను ఆటంకపరచుట ద్వారా, ఆయనకు హాని కలిగించుట ద్వారా, ఆయనకు సంబంధించిన వాటిని (లేద వారిని)అపహరించుట ద్వారా. ఉదాహరణకు, ఫరో పితరునితో సరియైన సంబంధం కలిగిలేడు ఎందుకనగాఅతని భార్యను తన అంతఃపురములోనికి చేర్చుకొనెను (12:10-17).ఆమెకు వివాహమైనదని ఎరుగక, అబ్రాహాముకు వ్యతిరేకంగా తెలియక ఈ కార్యం చేసినప్పటికీ, ఫరో తన ప్రజలందరి మీదికి దేవుని శాపాన్ని (వ్యాధులు మరియు “తెగుళ్లు”) తెచ్చెను.

తరువాత దేవుడు చివరి భాగమైన ఆశీర్వచనమును పలికెను, మరియు ఈ ఆశీర్వచనము అబ్రాహాము పిలుపునకు ప్రాముఖ్యమైన మరియు నిశ్చయాత్మకమైన లక్ష్యమై ఉన్నది: **భూమి యొక్క సమస్త వంశములు నీ యందు ఆశీర్వదించబడును**. 2వ వచనములో, “ఆశీర్వాదముగా నుందువు” అని దేవుడు పితరుని హెచ్చరించెను మరియు ఇప్పుడు ఆ హెచ్చరికను వ్యాపించెను: అబ్రాహాము ఆశీర్వాదములు జలప్రవాహములవలె అతి త్వరగా ముందు కుటుంబమునకు, స్నేహితులకు, శ్రేయోభిలాషులకు మరియు దూరస్తులందరికి చేరుతుంది. వాస్తవానికి, కడవరి వాగ్దానము ఉత్కంఠ భరితమైనది ఎందుచేతననగా, ఈ వాగ్దానము సకల ప్రజలకు, అన్ని కుటుంబాలకు ప్రయోజనకరముగా ఉంది-4 నుండి 11 అధ్యాయములలో చెప్పబడిన విధంగా, ఇతర దుష్టరాజ్యములకు తదుపరి వచ్చు తరములకు కూడా వర్తిస్తుంది. కొన్ని సంవత్సరాల తరువాత దేవుడు ఈ వాగ్దానమును అబ్రాహాముతో పునరుద్ఘాటించెను (22:18), తరువాత ఇస్సాకుతో (26:4), మరియు ఇశ్రాయేలు దేశ అంకురార్పణకు కారకులైన పండ్రెండుమంది కుమారులకు తండ్రియైన యాకోబుతో చేసెను (28:14). అబ్రాహాము విషయంలో దేవుని యొక్క కడవరి ఉద్దేశ్యం, కనాను దేశ సారవంతమైన భూమియందటకీ అందులో నివసించే ప్రజల అభివృద్ధినీ సూచిస్తుంది. అనేకమంది దైవాశీర్వాదాలు పొందుకొనుటకు అబ్రాహాము మూలపురుషుడుగా ఆయన సంతతిలోని చివరిగా ప్రపంచ “లోక రక్షకుడుగా” యేసుక్రీస్తు ఉద్భవించును (యోహాను 4:42; అపోస్తులుల కార్యములు 3:25; గలతీ 3:8; 1తిమోతి 2:3-6).

## దేవుని పిలుపునకు అబ్రాహాము యొక్క స్పందన (12:4-9)

**[4]యెహోవా అతనితో చెప్పిన ప్రకారము అబ్రాము వెళ్లెను. లోతు అతనితో కూడ వెళ్లెను. అబ్రాము హారానునుండి బయలుదేరినప్పుడు డెబ్బది యైదేండ్ల యీడు గలవాడు. [5]అబ్రాము తన భార్యయయిన శారయిని తన సహోదరుని కుమారుడయిన లోతును, హారానులో తానును వారును ఆర్జించిన యావదాస్తిని వారు సంపాదించిన సమస్తమైనవారిని తీసికొని కనానను దేశమునకు వెళ్లుటకు బయలుదేరి కనానను దేశమునకు వచ్చిరి, [6]అప్పుడు అబ్రాము షెకెమునందలి యొక స్థలముదాక ఆ దేశ సంచారముచేసి మోరేదగ్గరనున్న సింధూరవృక్షమునొద్దకు చేరెను. అప్పుడు కనానీయులు ఆ దేశములో నివసించిరి. [7]యెహోవా అబ్రామునకు ప్రత్యక్షమయి-నీ సంతానమునకు ఈ దేశ మిచ్చెదనని చెప్పగా అతడు తనకు ప్రత్యక్షమైన యెహోవాకు ఒక బలిపీఠమును కట్టెను. [8]అక్కడ నుండి అతడు బయలుదేరి బేతేలుకు తూర్పుననున్న కొండకు చేరి పడమటనున్న బేతేలునకును తూర్పుననున్న హాయికిని మధ్యను గుడారము వేసి అక్కడ యెహోవాకు బలిపీఠమును కట్టి యెహోవా నామమున ప్రార్థన చేసెను. [9]అబ్రాము ఇంకా ప్రయాణము చేయుచు దక్షిణ దిక్కుకు వెళ్లెను.**

**వచనములు 4, 5.** కొన్ని సంవత్సరాలు **హారానులో** గడచిన తరువాత మరియు పితరుని యొక్క తండ్రి తెరహుమృతిచెందిన తరువాత (11:32), **యెహోవా అతనితో చెప్పిన ప్రకారము అబ్రాము విశ్వాసము ద్వారా బయలుదేరెను** (అపొ. 7:4 చూడుము). కనాను దేశము వెళ్లుటకు అబ్రామును దేవుడు పిలిచినప్పుడు, డెబ్బదియైదేండ్ల యీడు గలవాడు; కాని శారయి గోడ్రాలైనందున అతడు బిడ్డలు లేనివానిగా ఉండెను. మరోసారి విశ్వాసం కలిగియుండవలెనని సవాలు చేయబడెను. వారి కుటుంబమును వెనుక విడిచిపెట్టుటకు అయిష్టంగా ఉండినప్పటికీ తన సహోదరుని కుమారుడైన లోతును తనతో కూడా తీసుకొనెను, ఎంచేతననగా, ఒకవేళ శారయి గోడ్రాలుగా మిగిలిపోతే తన వారసునిగా అంగీకరించుటకు తీసుకువెళ్లియుండవచ్చును. రచయిత అబ్రాహాము యొక్క ఉద్దేశమును బయలుపరచలేదు.

**వారు ఆర్జించిన యావదాస్థిని ... మరియు వారు సంపాదించిన** సమస్తమైనవారిని తీసుకొని అబ్రాహాము మరియు లోతు కనాను దేశము పోవుటకు ప్రయాణము ప్రారంభించెను. "ఎక్కడికి వెళ్లవలెనో అది ఎరుగక బయలువెళ్లెను" అని హెబ్రీ రచయిత చెప్పెను (హెబ్రీ 11:8). కనాను బహుదూర దేశమనియు (హారానుకు ఇంచుమించు దక్షిణ పశ్చిమ నుండి నాలుగు వందల మైళ్లు) పితరునికి మరియు ఆయనతోనున్న వారికి ఈ ప్రయాణము సులభము కాదని వారు ఎరిగిరి. అబ్రాహాముకు మరియు లోతుకు కలిగియున్న గొర్రెల

మందను, పశువుల మందను కాపాడుటకు వారికి అనేకమంది పనివారు (బానిసలు[4]) కలరని; ఈ పనివారే ఆయా సందర్భాలను బట్టి యుద్ధము చేయడానికి శిక్షణ పొందియుండిరని స్పష్టంగా తెలియజేస్తుంది.[5]

అయినప్పటికీ, బహుదూరమైన మరియు ప్రమాదకరమైన మార్గములో, నీరుకలిగిన ప్రాంతమైన యుఫ్రాటీసు నదిని విడిచి, ప్రయాణికులకు బందిపోటు దొంగల ద్వారా హాని కలిగించే, తక్కువ జనాభాగల ప్రాంతంలో నుండి పోవాలనే నిర్ణయము సాధారణమైన నిర్ణయం కాదు. బహుశా వారు హారాను నుండి కర్కిమేషు తరువాత దక్షిణము నుండి అలెప్పోకు వెళ్లియుండవచ్చును. అక్కడ నుండి వారు దక్షిణముగా దమస్కు ప్రధాన రహదారితీసుకొని[6] తదుపరి కనాను చేరియుండ వచ్చును. ఇది కూడా కష్టతరమైన ప్రయాణమే ఎందుచేతననగా వారు ప్రయాణం చేసే కొన్ని ప్రాంతాలు హారాను దగ్గరనున్న బాలి నదీతీరప్రాంతంలో వారి స్వస్థలమంత సారవంతమైన ప్రదేశాలు కావు. వారు గమ్యానికి చేరు సమయానికి బహుశా వారు బాషాను నుండి వచ్చి (నేడు గోల్డెన్ హైట్స్ అని పిలువబడుతుంది) యొర్దాను నది గుండా పశ్చిమానికి కదలి కనానుకు చేరెను.

**వచనము 6.** దక్షిణమునకు ప్రయాణము కొనసాగించి, **అబ్రాము షెకెమునందలి యొక స్థలముదాకా దేశ సంచారము** చేసెను. ఇబాలు మరియు గెరీజీము పర్వతముల మధ్యలో ఉన్నటువంటి కనాను మధ్య ప్రదేశంలో ఈ పట్టణము ఉంది.[7] పితరులకు మరియు తరువాత తరచూ పేర్కొనబడిన ఇశ్రాయేలీయులకు ఇది అతి ప్రాముఖ్యమైన స్థలముగానుంది (33:18; 35:4; 37:12, 13; యెహో. 24:1; న్యాయాధి. 9:6; 1 రాజులు 12:1).

అబ్రాహాము షెకెమునందలి, మమ్రేదగ్గరనున్న సింధూరవృక్షము నొద్దకు చేరెను. అనేక సింధూరవృక్షముల మధ్యలో ఉన్న ఈ వృక్షం ప్రాముఖ్యమైనది అయ్యుండవచ్చు.[8] తరువాత ఈ ప్రదేశములో యాకోబు తన యింటివారికి చెందినటువంటి అన్యదేవతలన్నిటిని దాచిపెట్టెను (35:4), యెహోషువా పెద్ద రాతిని నిలువబెట్టెను (యెహో. 24:25, 26) మరియు అబీమెలెకు ఆ పట్టణమునకు రాజుగా నియమింపబడెను (న్యాయాధి. 9:6).

తదుపరి ప్రకటన **అప్పుడు కనానీయులు ఆ దేశములో నివశించిరి** అని తెలియజేస్తుంది. పితరుడైన అబ్రాహాము ఆ దేశంలోకివెళ్ళే సమయానికే మరియు దేవుడు తనకు, తన సంతతివారికి ఆ దేశాన్ని స్వాస్థ్యంగా ఇస్తానని వాగ్దానము చేసినసమయానికీ కనానీయులు ఆ దేశమును ఆక్రమించుకొనిరి అనునది రచయితచేసినటువంటి సాధారణ పరిశీలన కావచ్చును. కాబట్టి, అబ్రాహాము ఎందుకు భూమిని తక్షణమేస్వాధీనపరచుకొనలేదు అనే విషయమును వివరిస్తుంది. మరో విధంగా, అబ్రాహాము కనాను చేరేసమయానికి కనానీయులు కనాను ప్రాంతమును నియంత్రించుటలో ప్రాముఖ్యులని గుర్తు చేస్తుంది. ఇవి ఆదికాండము పాఠకులకు తరువాత వ్యాఖ్యానము కావచ్చును. ఈ విషయంలో,

ఈ వాక్యము పరిశుద్ధాత్మ ప్రేరేపణలో మోషే సమయమునకు మునుపు, అంటే వాగ్దాన దేశములో కనానీయులను ఒక వాస్తవిక ముప్పుగా ఉండకుండా వారిని హరించినప్పుడు, లిఖితము చేయబడింది. ఈ వాక్యము యొక్క ఖచ్చిత అర్థము ఏమైయుందో లేదా వాగ్దాన దేశమునకు వచ్చే ముందు అబ్రాహాము అప్పటికే ఎదుర్కొన్న విశ్వాసపు సవాళ్లు ఏమైయున్నాయో అనే విషయమునకు సంబంధం లేకుండా, ఆ ప్రదేశమును కనానీయులు ఆక్రమించుకున్నప్పుడు కూడా వీటన్నిటి మధ్యలో మన పితరుడు స్థిరుడుగా ఉన్నాడు.

**వచనము 7. యెహోవా అబ్రామునకు కీలకమైన సమయములో ప్రత్యక్షమయ్యెను**. అబ్రాహాము ఊరు అనే గ్రామములో ఉన్నప్పుడే మొదట దైవప్రత్యక్షత పొందియుండెనని స్తెఫను చెప్పినప్పటికీ (అపొ. 7:2)[9] ఆదికాండ కథనము ప్రకారముగా ఇది అబ్రాహాముకు కలిగిన మొదటి ప్రత్యక్షతగా పేర్కొనబడినది (15:17 17:1; 18:1 చూడండి). ఏ రూపంలో ఈ ప్రత్యక్షత కలిగినది అనేది అస్పష్టంగా ఉంది; కాని ఏదిఏమైనప్పటికీ పితరునికి ఈ నూతన ప్రదేశంలో దేవుని యొక్క ప్రసన్నత ఒక భరోసాగా ఉంది.

అబ్రాహాముకు ఆ సమయంలో సంతానంలేనప్పటికీ **నీ సంతానమునకు ఈ దేశమిచ్చెదనని** యెహోవా వాగ్దానము చేసెను. "సంతతివారు" అని అనువదించబడిన పదము హెబ్రీ పదము זֶרַע (*zera'*), అక్షరార్థముగా "విత్తనము" అని అర్థం. ఇది తరచుగా సముదాయ నామవాచకముగా మరియు బహువచనం "వారసులుగా" అనువదించబడింది. ఈ సందర్భంలో, అబ్రాహాము "సంతానం" అనునది అతని నుండి వచ్చి వాగ్దాన భూమిని పొందుకొనిన ఇశ్రాయేలీయులను సూచిస్తుంది మరియు ఈ పదము ఆదికాండ వర్ణనలన్నిటిలో కనిపిస్తుంది.[10]

గడచిన దైవప్రత్యక్షతకు మరియు వాగ్దానమునకు ప్రతిస్పందనగా అబ్రాహాము మొదటి కార్యముగా **యెహోవాకు ఒక బలిపీఠమును కట్టెను**.[11] మెసొపొతమియ నుండి హారాను మీదుగా అతిక్లిష్టమైన పరిస్థితులలో కనానుకు నడిపించిన యెహోవాకు అబ్రాహాము కృతజ్ఞతస్తుతి అర్పించెను. ఇది త్యాగారాధనతో కూడిన బలిపీఠము కాదని కొందరు తలస్తారు, వేరే ఉద్దేశం సందేహాస్పదమైనది. బలి పశువులను గూర్చి పేర్కొనకుండా అబ్రాహాము బలిపీఠం కట్టుటకు ఇది మొదటి సన్నివేశం అయినప్పటికీ, అబ్రాహాముకు దేవుడు ప్రత్యక్షమైనప్పుడు బలిపీఠంపై జంతుబలులు అర్పించాలని చెప్పకపోయినప్పటికీ దేవుడొక రోజు వారి సంతానానికి వాగ్దాన కనానును ఇస్తాడని మన పితరుల విశ్వాసమైయున్నది. అయినప్పటికి, ఆదికాండము ప్రారంభం నుండి దేవునికి బలులు అర్పించే విషయం మనం చదువుచునే యున్నాము. హేబెలు జంతువులను దేవునికి బలిగా అర్పించాడు (ఆది. 4:4). జలప్రళయం తరువాత నోవాహు అదేవిధముగా చేసెను (8:20), తరువాత అబ్రాహాము తన కుమారుడైన ఇస్సాకుకు ప్రతిగా పొట్టేలు దహన బలిగా అర్పించెను (22:13). అట్టి సంశయవాదము పంతొమ్మిదవ

శతాబ్దపు దస్తావేజు సంబంధమైన పరికల్పన (Documentary Hypothesis) సిద్ధాంత ఊహాగానముల నుండి వెలువడుతుంది. ఇందులో తరువాత కాలమునకు చెందిన యాజకులు అట్టి బల్యాత్మక ఆరాధనను కనుగొని వాటిని తిరిగి పితరుల కథనములలోనికి చదివారు.

యెహోవా ఇతర దేవుళ్లలో ఒకడు కాదని అన్యుల పొలిమేర దేవతల కంటె గొప్పవాడని ఈ దైవప్రత్యక్షత కలిగే వరకు పితరులు గ్రహించలేదని అనుమానిస్తుంటారు. పురాతన ప్రజల యొక్క దేవుళ్లు శక్తి భూగోళకంగా కొన్ని ప్రాంతాలకు అనగా మెసొపొతమియ లేదా కనానుకు మాత్రమేవర్తిస్తుంది అని వారు నమ్మిరి. అయినప్పటికీ, దేవుడైన యెహోవా గొప్పవాడును, తనను తన పనివారిని మరియు తనకు కలిగిన సమస్తమును తాను ప్రవేశించు నూతన దేశమందు పోషించి, కాపాడగల సమర్థుడని నమ్మకపోయినా యెడల, అబ్రాహాము ఇష్టంలేకుండానే సొంత ఊరును లేక తరువాత హారానును విడచియుండడు.

ఊరు నుండి అబ్రాహామును దేవుడు పిలువక మునుపు తన కుటుంబీకుల వలె వేరే దేవతలను ఆరాధించేవాడని మనకు తెలుసు (యెహోషువా 24:2, 3); మరియు అన్యతలంపులను విడిచిపెట్టి సార్వత్రిక దేవునియందు నమ్మిక యుంచడానికి ఎంత కాలము పట్టిందో మనకు చెప్పబడలేదు. దేవుడు నిజముగా “సర్వశక్తి గలవాడని” (17:1) ఆయనకు “అసాధ్యమైనది” ఏదీ లేదని (18:14) పితరులు తెలిసికొనుటకు వారికి సమయం పట్టినట్లుగా మన బైబిల్లో గ్రంథస్తం చేయబడింది. మరోవిధముగా, “విశ్వాసమును బట్టి అబ్రాహాము” తన సొంత దేశమును విడిచి “తాన స్వాస్థ్యముగా పొందనైయున్న ప్రదేశమునకు బయలువెళ్లెను” అని హెబ్రీ 11:8లో చెప్పబడింది. దేవునియందు విశ్వాసం అనునది “ఆయన ఉన్నాడని” నమ్ముట మాత్రమే కాదు గాని వెదకిన వారికి దేవుడు ప్రతిఫలమియ్యగలడు”(హెబ్రీ 11:6), దేవుడు తాను చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకునే విషయంలో గొప్పవాడని, సామర్థ్యముగలవాడని అబ్రాహాము నిశ్చయత కలిగియున్నాడు.

**వచనము 8**. షెకెము నుండి అబ్రాహాము బయలుదేరి **బేతేలుకు తూర్పుననున్న కొండకు చేరి బేతేలునకును హాయికిని మధ్యను గుడారము వేసుకొనెను. సహజంగా బేతేలు బేటెన్ గా గుర్తించబడింది**; (ఉత్తర దిక్కున యెరూషలేమునకు రమారమి 10 మైళ్ల దూరంలో ఉంది; మరియు హాయి ఎట్ టెల్ గా చెప్పబడింది (దక్షిణతూర్పుగా ఇంచుమించు రెండు మైళ్లు), దీనిని గుర్తించుటలో కొందరికి ఇప్పటికీ వివాదం ఉంది.[12] బేతేలుకు అసలు పేరు “లూజు” (28:19), ఇక్కడ మార్పును యెరిగి రచయిత క్రొత్త పేరు వాడియుండవచ్చును.

అబ్రాహాము ఎక్కడికి వెళ్లినా గుడారము వేసికొని తరువాత బలిపీఠమును కట్టెను, పితరులు ఎక్కడకు ప్రయాణం చేసినా వారు కనానీయుల బలిపీఠమును వాడలేదు. తను సొంతంగా బలిపీఠమును కట్టెను. వాక్యము చెప్తుంది, **అబ్రాహాము**

**యెహోవ నామమున ప్రార్థన చేసెను** (4:26 పై వివరణ చూడండి). అబ్రాహాము దేవుని నామమును పిలచిన కారణము, అందరి దేవుళ్లు ఒకటేనని మా దేశమును మా దేవుణ్ణి ఎవరూ వేరుచేయలేరనే పురాతన అన్య లోకము యొక్క అభిప్రాయమును వమ్ము చేయుటకు అలా పిలచెను. అబ్రాహాము సంతతికి కనానును స్వాస్థ్యంగా ఇస్తానని వాగ్దానం చేసిన యెహోవా సర్వాధికారి అని గ్రహించి అబ్రాహాము ప్రభువు నామమున ప్రార్థించెను.

**వచనము 9.** పితరుడు తన ప్రయాణమును ఉత్తర భూబాగం నుండి దక్షిణ భూభాగమైన **నెగెవు వైపు** కొనసాగించెను. దక్షిణ భూభాగమైన వాగ్దాన దేశములో నెగెవు అనేది ఎక్కువ విస్తీర్ణత గల ప్రాంతము. ఇది కాదేషుబర్నియా దక్షిణముగా బయేర్షేబాకు దగ్గరగానున్న కొండ ప్రాంతము వరకు వ్యాపించియున్నది. వందల సంవత్సరాల తరువాత, ఇశ్రాయేలీయులు కాదేషులో నివసించి గోత్రానికి ఒకరు చొప్పున కనాను దేశమును వేగు చూడుటకు వెళ్లెను (సంఖ్యా. 13:1–26). సంవత్సరమునకు ఎనిమిది అంగుళాల అతి తక్కువ వర్షపాతం, పంట సరిగా లేనందువలన ప్రజలు కొద్దిమందిగా నివసించేవారు. అయినప్పటికీ, కనీసం వసంత కాలంలో పశువులకు, మందలకు కావలసిన గడ్డినిచ్చుటకు తేమ అనుకూలంగా ఉన్న కారణాన వారు నివసించిరి.

## ఐగుప్తులో అబ్రాహాము మరియు శారా (12:10–20)

12:1–9లో వివరించబడిన సంఘటనలకు మరియు 12:10–20లో నున్న సంఘటనలకు మధ్య ఎంత సమయం గడచిందో మనకు తెలియబడలేదు. దక్షిణ భాగమైన కనానులో వర్షం ఎల్లప్పుడు చెదురుమొదురుగా పడుతుంది; ఇది మానవులకు మరియు జంతువులకు జీవనాధారమునకు ఆర్థిక పరిస్థితులను నిర్వహించుటలో ప్రాముఖ్యమైనది. వర్షాలు నిలిచిపోవుట ప్రారంభించక మునుపు మరియు అబ్రాహాము యొక్క సమూహము అపాయంలో ఉన్నప్పుడు కొన్ని నెలలు లేదా కొన్ని సంవత్సరాలు గడిచియుండ వచ్చునుకాని ప్రయాణికులకు చావు బ్రతుకుల సమస్య వచ్చినప్పుడు కనానును విడిచిపెట్టుటకు ఇష్టపడిరి.

### ఐగుప్తులో అబ్రాహాము యొక్క మోసము (12:10–16)

**[10]అప్పుడు ఆ దేశములో కరవు వచ్చెను. ఆ దేశములో కరవు భారముగా నున్నందున అబ్రాము ఐగుప్తు దేశములో నివసించుటకు అక్కడికి వెళ్లెను. [11]అతడు ఐగుప్తులో ప్రవేశించుటకు సమీపించినప్పుడు అతడు తన భార్యయయిన శారయితో– ఇదిగో నీవు చక్కనిదానివని యెరుగుదును. [12]ఐగుప్తీయులు నిన్ను చూచి ఈమె అతని భార్య అని చెప్పి నన్నుచంపి నిన్ను బ్రతుక నిచ్చెదరు. [13]నీవలన నాకు మేలుకలుగునట్లును నిన్ను బట్టి నేను బ్రతుకునట్లును నీవు నా**

**సహోదరివని దయచేసి చెప్పుమనెను. [14]అబ్రాము ఐగుప్తులో చేరినప్పుడు ఐగుప్తీయులు ఆ స్త్రీ మిక్కిలి సౌందర్యవతియయి యుండుట చూచిరి. [15]ఫరోయొక్క అధిపతులు ఆమెను చూచి ఫరోఎదుట ఆమెను పొగడిరిగనుక ఆ స్త్రీ ఫరోయింటికి తేబడెను. [16]అతడామెనుబట్టి అబ్రామునకు మేలుచేసెను; అందువలన అతనికి గొర్రెలు గొడ్లు మగ గాడిదలు దాసులు పనికత్తెలు ఆడగాడిదలు ఒంటెలు ఇయ్యబడెను.**

**వచనము 10**. కనానులో **కరవు** సమయములో తన ప్రజలను, పశువులను, గొర్రెలను తీసికొని ఐగుప్తు దేశములో నివసించుటకు అబ్రాహాము అక్కడకు వెళ్లెను. వలస వెళ్లుటకు కారణము వక్కాణము కొరకు మరలా చెప్పబడెను: **కనానులో కరవు భారముగా నున్నందున** వారికి బ్రతుకుతెరువు కుడా కష్టమని అనిపించి ఐగుప్తు వెళ్లెను (26:1; 41:54, 56; 43:1 చూడండి).[13]

అబ్రాహాము ఐగుప్తులో సమృద్ధి ఆహారము ఉన్నదని విన్నాడు. ఐగుప్తు సామాన్య వర్షాపాతంగల దేశమైనప్పటికీ ఆ నేలకు సారం ఆఫ్రికా దేశం నుండి నైలు నది ప్రవహించుట ద్వారా సంవత్సరమునకు ఒకసారి వచ్చే వరదల ద్వారా నీరు, ఒండ్రు మట్టి నేలలో చేరి తడిపి సారవంతమైన గొప్ప పంటను ఇస్తుంది. దీనిని బట్టి చాలా మంది ప్రజలు మధ్యధారా లోకానికి ఐగుప్తు రొట్టెల ఇల్లుగా పరిగణిస్తారు. దీనిలో ఎక్కువ భాగము, చుట్టూ ఉన్న ప్రదేశముల వలె కరువుకాటకముల ద్వారా ఆర్థికంగా ఇబ్బందిపడే ప్రదేశములు కావు.

ఈ ఫలితాలు మాత్రమే కాకుండా అబ్రాహాము వేరే పుకారులు విన్నాడు. ఐగుప్తీయులకు అతిథులుగా వచ్చినవారి భార్యలను అందంగా ఉంటె వారి భర్తలను చంపి, వారి భార్యలను తమ భార్యలుగా చేసుకుంటారని విన్నాడు. ఇది అబ్రాహాము నివసించవలసిన అనుకూల స్థలము కాదు. “నివసించుట” (גּוּר, *gur*) అంటే పరదేశిగా ఉండుట అని అర్థం. అబ్రాహాము మరియు శారా పౌర హక్కులు లేకుండా, రక్త సంబంధులు లేకుండా తాత్కాలికంగా ఐగుప్తులో నివసించిరి. అననుకూల పరిస్థితులలో వారు ఏమిచేయవలసిందని తోచక దేవుని నడిపింపు కొరకు ఎదురుచూచుచున్నారు. అతని మొదట అభిప్రాయము, కరవు పరిస్థితి తీవ్రంగా ఉన్నపటికీ దేవుడు నడిపించిన స్థలములో ఉండాలని అబ్రాహాము ఆశించెను. రెండవ అవకాశం, కనాను విడిచి ఐగుప్తుకు వెళ్లుట. ఈ రెండు మార్గాలలో ప్రమాదం మరియు మరణం పొంచి ఉంది. మరోసారి అబ్రాహాము తన విశ్వాస విషయంలో ఇబ్బందికరమైన పరిస్థితిని ఎదుర్కొనుచున్నాడు, ఈ విషయం ప్రభువుతో చెప్పినదీ లేనిదీ మనకు కనిపించలేదు. దేవుడు తన సంతానమునకు వాగ్దానము చేసిన దేశమును విడచుటకు తనంతట తానుగా అప్పుడే నిశ్చయించుకొని ఉంటాడు (12:7) మరియు ఇది చేయుటకు మోసమును ఒక బ్రతుకుదెరువు చూపే ఎత్తుగడగా ప్రయోగించాడు.

**వచనములు 11, 12.** అనుచరులు **ఐగుప్తు దేశము వచ్చినప్పుడు**, శారా విషయంలో తను అందమైన స్త్రీ కనుక ఈ విషయాన్ని ఐగుప్తీయులు గుర్తించి అతని భార్యని గమనిస్తారని హెచ్చరించారు. అప్పుడు అబ్రాహాము చెప్పెను, **నన్ను చంపి నిన్ను బ్రతుకనిచ్చెదరు**. పురాతన సమాజములలో వలసగా వచ్చినవారు తరచూ అపాయంలో ఉండేవారని అబ్రాహాముకు ఖచ్చితంగా తెలుసు. సొంత ఊరులో పౌరులకు ఉండవలసిన భద్రత మరియు మద్దత్తులు వారికి లేవు. ఐగుప్తీయులు భార్యలను దొంగిలించడంలో నిమగ్నమై ఉన్నారనియు శిక్షతో కూడిన హత్యలు చేస్తారనే సాధారణ పరిజ్ఞానం తప్ప అబ్రాహాము ఎందుకు కనానులో సురక్షితమని భావించి, ఐగుప్తులో హాని అని భావించాడన్నది అస్పష్టముగా ఉంది. అదనంగా, ఫరో మరియు ఆయన అధికారులు ఇటువంటి కార్యాలలో నిమగ్నమైయున్నారని అబ్రాహామునకు తెలియక పోయినప్పటికీ, తనలాంటి పరదేశులు ఐగుప్తీయుల దేశములో ఉన్నప్పుడు వారిపై ఆ దేశపువారు అఘాయిత్యాలు చేసినట్లుగానే ఆ ప్రభుత్వపు అధికారులు వారిపట్ల వేరేగా ప్రవర్తించారని అబ్రాహాము అనుమానించి ఉంటాడు.

శారా యొక్క అందమునుబట్టి తరచుగా అనేక ప్రశ్నలు రేకెత్తాయి. అరవైయైదు సంవత్సరాలు[14] గల స్త్రీ అంత అందంగా ఎందుకు పరిగణింపబడింది మరియు ఆమె కోసం పురుషులు ఎందుకు చంపబడతారో? అనేక వివరణములు ఇవ్వజూసారు, కాని ఎక్కువగా ఇవ్వబడింది మాత్రం నేటి కంటే పితృస్వామ్య కాలంలో ప్రజలు ఎక్కువ కాలం నివసించేవారు మరియు నెమ్మదిగా ముసలివారు అయ్యేవారు. శారా 127 సంవత్సరాలు (23:1) జీవించినది కనుక తను మరియు అబ్రాహాము ఐగుప్తు వెళ్లేసరికి నిజానికి శారా నడి వయస్కురాలు.

**వచనము 13.** అబ్రాహాము, శారాని వేడుకొని, ఆయనకు **మేలుకలుగునట్లు**, ఐగుప్తీయులు అతనిని బ్రతుకనిచ్చెదరని తలంచి వారు భార్యాభర్తలు కాక నా **సోదరివని** దయచేసి **చెప్పుమనెను**. శారా నిజానికి అబ్రాహాము భార్యయే; అయినప్పటికీ, ఆమె తన సవతి సోదరి కూడా ఎందుకంటె వారికి తండ్రి ఒక్కడే (తెరహు) కాని తల్లులు వేరు (20:12). ఇక్కడ మళ్ళీ అబ్రాహాము తన విశ్వాసములో అపరిపక్వంగా ఉండడం మనం చూస్తాం ఎందుకంటే అబ్రాహాము తన భార్య భద్రతకంటే తన సొంత శ్రేయస్సును కోరుకున్నాడు కాబట్టి వారి సంబధం గురించి ఐగుప్తీయులకు మరుగుపరిచాడు. అతని భార్య పరుల మంచం మీదికి తీసుకొనిపోబడవచ్చని లేక అత్యాచారం చేయబడవచ్చని అబ్రాహాము ఆంధోళన చెందలేదు.ఆమె సద్గుణంతో రాజీపడడం ద్వారా విశ్వాసము మరియు ఆధ్యాత్మిక జీవితం నిలుస్తాయని అబ్రాహాము బహుశా భావించలేదు ఎందుకంటె తన భర్త యొక్క మోసం. అదనంగా, ఈ విదేశంలో అతనికి హాని కలిగించే వారి నుండి కాపాడమని అబ్రాహాము దేవునిని వేడుకొనలేదు. ఆయన భార్య విషయంలో అబద్ధం చెప్పుదామని నిర్ణయించుకొని, సహోదరిపై సహోదరునికి ఉండే శ్రద్దనే

చూపించాడు.

కొంత మంది అబ్రాహాము క్రియలను ఈ విధంగా చెప్తూ సమర్ధిస్తారు. శారాకు సహోదరుడని అబ్రాహాము చెప్పుకొనుట ద్వారా అతను ఆశించింది ఏమంటే మగ ప్రియుల వేడుకోళ్లను మరియు వివాహమును గూర్చిన వారి ప్రతిపాదనలను మళ్ళించడం. నిజానికి అబ్రాహాము ఇది చేయవలసిన అవసరము లేదు. అతను కరవు ఎత్తివేయబడే వరకు సంపాదించుకొని తరువాత తను మరియు తన కుటుంబము తిరిగి కనానుకు తప్పించుకొందుము అని భావించి ఉండవచ్చును. అయితే పితరుడైన అబ్రాహామును క్షమించే ఇలాంటి హేతుబద్ధీకరణకు వాక్యములో ఎలాంటి ఆధారము లేదు. అబ్రాహాము తనను చంపడానికి చూస్తున్న వారి నుండి తప్పించుకొనుటకు వారి సంబంధం గురించి తన భార్యను అబద్ధం చెప్పమని ఒప్పించుటకు పిరికిగా నటించాడు.

**వచనములు 14, 15.** అబ్రాహాము **ఐగుప్తులో** చేరినప్పుడు అతడు భయపడిన విధంగానే, (శారా) **మిక్కిలి సౌందర్యవతియై యుండుట ఐగుప్తీయులు చూచిరి. ఫరో**[15] **యొక్క అధికారులు కూడా** ఆమె అందంగా ఉండుట గమనించి రాజుకు ఈ సమాచారమును ప్రసారం చేసారు. దానికి ఫలితంగా, **ఆమె ఫరో ఇంటికి తేబడెను.** అబ్రాహాము నివేదనకు శారా యొక్క ప్రతిస్పందన ఈ వాక్యంలో చెప్పబడలేదు. మోసపూరితమైన పథకం గురించి శారా యొక్క అనుభూతి ఎలా ఉంది? ఐగిప్తు అధికారులు రాజుయొక్క అంతఃపురమునకు ఆమెను తీసుకువచ్చినప్పుడు ఆమె ఇష్టపూర్వకముగా సహకరించి దానిని ఆమోదించినదా? తన భర్త ప్రాణాలు కాపాడేందుకు వారి తంత్రముతో సహకరించి ఉంటుందని ఆమె నిశబ్దం బట్టి అర్దమవుతుంది. ఇంకా ఈ పరిస్థితిలో ఆమె ఉపయోగింపబడినదిగా మరియు నిస్సహాయంగా ఉందని భావించారు. పరుడి ద్వారా ఉల్లంఘింపబడి అతనినే బలవంతంగా పెళ్లి చేసుకోవాలనే ఆలోచన వలన ఆకస్మికంగా కలుగు అసహ్యమును ఎదుర్కొంది.

**వచనము 16.** ఈలోపు,అబ్రాహాము తను కోరుకున్న సోదరి[16] నష్టాన్ని భర్తీ చేయుటకు ఫరో అబ్రాహాముకు ఘనంగా **గొర్రెలు, ఎడ్లు, గాడిదలు, ఒంటెలు**, వాటికి అదనంగా **ఆడ మరియు మగ** పనివారిని (లేదా బానిసలు) బహుమానముగా ఇచ్చెను. ఇక్కడ ఇవ్వబడిన జాబితాలోని జంతువులు మరియు సేవకులు ముఖ్యంగా పిత్రుస్వామ్య యుగములో సంపన్న వ్యక్తుల యొద్ద మాత్రమే ఉండేవి (20:14; యోబు 1:3). ఈ చరిత్ర ప్రారంభ కాలంలో, ఒక వ్యక్తి యొక్క సంపద అనేది ఒక బ్యాంకులో ఉన్న డబ్బు లేదా పెట్టుబడుల డబ్బు లేదా బంధంలో గాని లేదు. సంపద అనేది ప్రథమంగా కాలి డెక్కలపైన అనగా ఒక వ్యక్తి దగ్గరనున్న జంతువులపైన వాటిని కాపాడేటటువంటి బానిసలపైన ఆధారపడి ఉంది. ఈ ఆధారంగా, అబ్రాహాము చాలా సంపన్న వ్యక్తి అవుతున్నాడు. ఇక్కడ లోటు గురించి చెప్పకపోయినప్పటికీ ఐగుప్తులో అబ్రాహాముతో ఉన్న లోతు కూడా

సంపన్నుడు (13:1 చూడుము). తరువాత అధ్యాయంలో, ఈ ఇద్దరికి సంబంధించిన గొర్రెల మందలు మరియు జంతువులు ఎక్కువగా ఉన్నందున వాటికి కావలసిన మేతభూమిపై వారి పశువుల కాపరుల మధ్య కలహాలు తలెత్తుట కనబడుతుంది. కనానులో కరవుకాలంలో తగినంత నీరు మరియు గడ్డి అబ్రాహాము జంతువులకు మరియు సేవకులకు మనుగడలో లేకుంటే, తన అన్న కుమారుడు, గొర్రెల మందలు మరియు ప్రజలు అబ్రాహాముతో ఐగుప్తువెళ్లకుండా ఎలా జీవించి అభివృద్ధి చెందెను?[17]

బహుమాన భాగంగా ఫరో అబ్రాహాముకు ఇచ్చిన వాటిల్లో "ఒంటెల" యొక్క ప్రస్తావనను కొంత మంది బైబిలు పండితులు ఆ కాలమునకు చెందని వాటిగా పరిగణిస్తున్నారు, ఎందుకంటే అలాంటి జంతువులు సాధారణముగా పురాతన ప్రపంచము యొక్క చివరి భాగమైన క్రీ.పూ. రెండో సహస్రాబ్దిలో వాడేవారు కాదు. అయితే ఇప్పుడు పెంపుడు ఒంటెలను గురించి కొన్ని ఆధారాలు కలవు, అవి క్రీ.పూ. 2700 మొదట్ల ఇరాన్లో మరియు క్రీ.పూ. 2300 నాటికి సింధూ లోయలో మరియు ఆలస్యంగా క్రీ.పూ. మూడు నుండి ప్రారంభ రెండవ సహస్రాబ్దిలో దక్షిణ అరేబియాలో ఆధారాలు లభించాయి. ఇంకా పురాతన కనాను ప్రాంతమైన నెగెవు (దక్షిణ)లో ఒంటె ఎముకలు అరాద్ అను చోట మానవ సందర్భాలలో క్రీ.పూ. 2900లో కనుగొన్నారు మరియు క్రీ.పూ. సుమారు 1900 నుండి బిర్ రేసిసిం పొగమంచులో కనుకొన్నారు.[18] ఈ రెండవ తేదీ అబ్రాహాము సమయం తరువాత చాలా కాలం కాదు. ఒంటెలు కొరతగా ఉన్నవి అన్న ప్రారంభ ఖాతాలు ఒకవేళ ఒంటెలు విశేష భాగముగా పరిగణింపబడటం వలన కావచ్చును. అలా అయితే, ఆదికాండము ప్రారంభంలోఉన్న సూచనలు పితరుల యొక్క సంపదను ఒత్తి చెప్పియుండవచ్చును (13:2; 24:10; 26:12–14; 31:34 చూడండి).

## మోసం యొక్క పరిణామాలు (12:17–20)

**[17]అయితే యెహోవ అబ్రాము భార్యయయిన శారయిని బట్టి ఫరోను అతని యింటివారిని మహావేదనలచేత బాధించెను. [18]అప్పుడు ఫరో అబ్రామును పిలిపించి– నీవు నాకు చేసినది యేమిటి? ఈమె నీ భార్య అని నాకెందుకు తెలుపలేదు? [19]ఈమె నా సహోదరి అని యేల చెప్పితివి? నేనామెను నా భార్యగా చేసికొందునేమో అయితే నేమి, ఇదిగో నీ భార్య ; ఈమెను తీసికొనిపొమ్మని చెప్పెను. [20]మరియు ఫరో అతని విషయమై తన జనుల కాజ్ఞాపించనందున వారు అతనిని అతని భార్యను అతనకి కలిగిన సమస్తమును పంపివేసిరి.**

**వచనము 17.** కథలోని ఈ సమయంలో, దేవుడు జోక్యం **చేసుకొని ఫరోను అతని యింటివారిని మహా వేదనలచేత బాధించెను ఎందుచేతననగా అబ్రాము భార్యయైన శారయినిఅతడు** తీసుకొనెను. ఫరోకు విరుద్ధంగా దేవుడు

ఉపయోగించిన తెగుళ్ల యొక్క స్వభావమును బైబిలు సూచించలేదు. హెబ్రీ పదమైన נֶגַע (*nega'*) అనునది తరచుగా చర్మ వ్యాధిని లేదా కుష్టు వంటి ఒక వ్యక్తి నుండి మరొక వ్యక్తికి సంక్రమించు వ్యాధులను సూచిస్తుంది (లేవీకాండము 13; 14). అయితే, కొన్నిసార్లు తెగుళ్లు దైవ శిక్ష యొక్క ప్రత్యక్ష ఫలితంగా వస్తాయి, ఐగుప్తులో మోషే కాలంలో వచ్చినట్లుగా (నిర్గమాకాండము 11:1) మరియు దేవుడు ఉజ్జీయాకు కుష్టు కలిగించిన విధంగా (2 రాజులు 15:5[19]).

అబ్రాహాము భార్యను తీసుకొనుట వలన ఈ తెగుళ్లు దేవుని నుండి శాపంగా వచ్చినవని ఫరో నమ్మాడు. ఫరో తానే దేవుడనని నమ్మాడు గనుక, ఇశ్రాయేలీయులను బట్టి శక్తివంతమైన దేవుడు తనను శిక్షిస్తున్నాడని అతను ఒప్పితే తప్ప అబ్రాహాము మరియు శారా పట్ల దాక్షిణ్యముతో ప్రతిస్పందించేవాడు కాడు. ఈ విషయంలో ఆయన సత్యవంతుడు, ఎందుకంటే దేవుడు అబ్రాహాముతో "... నిన్ను దూషించువాని శపించెదను" (12:3) అని వాగ్దానం చేసెను. కనీసం ఈ సందర్భంలో, ఫరో అబ్రాహాము భార్యను తీసుకొనుటవలన, అబ్రాహాముతో సరియైన సంబంధంలేనివానిగా ఉన్నాడు. అందువలన దేవుడు పంపిన శాపాలకు (తెగుళ్లుకు) గురైయ్యారు.

**వచనములు 18, 19.** వివరాలు ఇవ్వనప్పటికినీ, అతని యింటిపైకి వచ్చిన తెగుళ్లుకు అబ్రాహాము యొక్క దేవుడే కారణమని రాజు నిర్ధారించెను (12:17). అందువలన, **ఫరో అబ్రామును పిలచెను**. తన అపరాధ భావనను విముక్తి చేసుకొని నింద అంతటిని పితరునిపై వేయుటకు ఆశించి, ఆయన మూడు ప్రశ్నలు సంధించాడు:

1. **నీవు నాకు చేసినది ఏమిటి?**
2. **ఈమె నీ భార్య అని నాకెందుకు తెలుపలేదు?**
3. **ఈమె నా సహోదరి అని యేల చెప్పితివి,
నేనామెను భార్యగా చేసుకొందునేమో అయితే నేమి?**

ఈ ప్రశ్నలకు స్పందించుటకు అబ్రాహాము యత్నించాడా? ఒకవేళ ఆయన ప్రయత్నించి ఉంటే, అతని జవాబులు మనకు ఇక్కడ నమోదు చేయబడలేదు.[20] శారాను అబద్ధము చెప్పుటకు ఒప్పించి ఐగుప్తు రాజును మోసగించుటలో ఆయన వ్యక్తిగతంగా నిమగ్నుడయ్యాడని మనకు తెలుసు కదా. మరొక వైపు, ఈ సమయములో ఫరో అజ్ఞానముగా నటించినప్పటికీ, ఈ విషయములో ఎంతమాత్రము అమాయకుడు మాత్రం కాదు. ఫరో అమాయకముగా నటించినప్పటికీ, ఆయన నిందార్హుడు. ప్రాచీన ప్రపంచంలో, నిరంకుశ నాయకుల ఇచ్చలు తిరస్కరించవలసినవి కావు; మరియు అబద్ధము చెప్పినప్పుడు అబ్రాహాము తన ప్రాణమునకు భయపడి అలా చేసాడు. ఇంకా, శారాతో తనకుగల

నిజమైన బంధాన్ని తెలియజేయడం అబ్రాహాముకు ఏదైనా అనుకూల వ్యత్యాసాన్ని కలిగించిందా అంటే అనుమానాస్పదమే. పొరుగువారిని మరియు వారి భార్యలను ఐగుప్తీయులు ఎలా పరిగణించేవారో అని చెప్పే కథలలో ఏమైనా నిజం ఉంటే, ఫరోను గూర్చి పితరుడు భయపడుటకు ఇక్కడ న్యాయబద్ధమైన కారణములు ఉన్నాయి. సమస్య ఏమంటే అబ్రాహాము యొక్క విశ్వాసము ఇంకను బలహీనంగానే ఉంది; తన సంతానము ద్వారా భూమియందలి జాతులన్నిటిని ఆశీర్వాదించాలనే దేవుని ప్రణాళికను (12:3) ఐగుప్తీయులు విఘాతము చేయకుండా యెహోవా చేయగలడని ఆయన ఇంకను నమ్మలేక పోయాడు.

ఫరో సంధించిన ప్రశ్నలకు అబ్రాహాము జవాబునిచ్చుటకు ఒక వేళ ప్రయత్నించినప్పటికీ, అట్టి సాకులు వినుటకు రాజు సిద్ధంగా లేడు. తన పొరుగువానిని అప్పటికే మందలతోను, పశువులతోను, మరియు దాసులతోను సంపన్నునిగా చేశాడు; ఇప్పుడు అతడు అబ్రాహాముచే ఇబ్బంది పెట్టబడి తన దేవునిచే బాధించబడ్డాడు. ఆయన అబ్రాహాముతో క్లుప్తంగా అన్నాడు, **ఇదిగో నీ భార్య; ఈమెను తీసికొనిపొమ్ము**. ఆయనకిచ్చిన జంతువులను మరియు దాసులను ఫరో తిరిగి అడగలేదు, ఎందుకంటే బహుశా దేవుడు మరెక్కువ తెగుళ్ల చేత బాధిస్తాడని భయపడి ఉంటాడు.

**వచనము 20. ఫరోకు** సంబంధించినంత వరకు, సాధ్యమైనంత త్వరగా అబ్రాహామును ఐగుప్తునుండి బయటకు పంపించడమే ఉత్తమమైన పని. కాబట్టి, ఆయన పితరుని తన **భార్యతోను తనకు కలిగిన సమస్తముతోను** బయటకు పంపమని **తన ప్రజలకు ఆజ్ఞాపించాడు**. అబ్రాహాముకు ఫరో ఇచ్చిన ధారాళమైన బహుమతులే ఆయన కలిగియున్న ఆస్తులు (12:16).

## అన్వయము

### అబ్రాహాముకు దేవుని పిలుపు (12:1–9)

"లేఖనము ... అబ్రాహామునకు సువార్తను ముందుగా ప్రకటించెను"అని గలతీ. 3:8లో అపొస్తలుడైన పౌలు చెప్పాడు.యేసుక్రీస్తు లోకంలోనికి వచ్చేవరకు "సువార్త" లేదు కాబట్టి ఇదెలా సాధ్యం? జవాబు "సువార్త" అనే పదానికున్న మౌలికమైన అర్థంలో ఉంది. గ్రీకు పదం εὐαγγελίζομαι (*euangelizomai*), దానికి అనుగుణ్యమైన హెబ్రీ పదం בָּשַׂר (*baśar*); ఈ రెండూ సువార్తను ప్రకటించటాన్ని లేదా సంతోషకరమైన వర్తమానాన్ని ప్రకటించడాన్ని సూచిస్తాయి.[21]

పాత నిబంధనలోని వ్యావహారిక సందర్భాల్లో, *baśar* అనే పదం సాధారణంగా యుద్ధంలో సాధించిన గెలుపుగురించి జయకరమైన (శుభప్రదమైన) వార్తను

సూచిస్తుంది(1 సమూ. 31:9; 2 సమూ. 1:20; 18:19, 20). అయితే ఈ పదానికి (వేదాంతపరమైన విషయాలకు) సంబంధించిన సందర్భాల్లో దేవుడెవరు పాపాత్ములు, నశించినవారు, బాధాపీడితులైన తన ప్రజల్ని విమోచించి రక్షించి ఆశీర్వదించడానికి ఆయన ఏం చేశాడో తెలిపే సువర్తమానం అని అర్థం (యెష. 52:7; 61:1).

దేవుడు అబ్రాహాముకు సువార్త (శుభసందేశం) తెలియజేసినప్పుడు, ఈ సందేశం పితరుడైన అబ్రాహాముకు, అతని వారసులకు, అంతిమంగా భూలోకంలో ఉన్న అన్ని జాతుల ప్రజలకు ఆయన వాగ్దానం చేసిన ఆశీర్వాదాలకు సంబంధించినదిగా ఉంది (12:2, 3). అబ్రాహాముకు ప్రకటించబడిన సువార్తయొక్క (శుభసందేశం) వివిధ దశలు లేక వివిధ కోణాలు ఏవి?

దేవుని పిలుపు కృప ద్వారా మాత్రమే. భూమి మీద అబ్రాహాము మిక్కిలి దైవభక్తి ఉన్నవాడని గానీ మరియు నీతిమంతుడనే కారణంగాగానీదేవుడు అతణ్ణి పిలిచి ఉండకపోవచ్చు. అదీ కాక ఈ పిలుపు, సీనాయి పర్వతం మీద ఇశ్రాయేలుకు ఇచ్చిన ధర్మశాస్త్రాన్ని వందల సంవత్సరాలకు పూర్వమే పితరుడైన అబ్రాహాము ఆచరించాడనీ కాదు.

వ్రాయబడిన విషయం చాలా స్పష్టంగా ఉంది: అబ్రాహాముకు గానీ అతని కుటుంబానికి గానీ నిజమైన దేవుని గురించి అతని ధర్మశాస్త్రం గురించి తెలియదు. వాస్తవానికి, ఇశ్రాయేలు పూర్వీకులైన "అబ్రాహాముకును నాహోరుకును తండ్రియైన తెరహు కుటుంబీకులు" యూఫ్రటీసు అవతల నివసించి" "యితర దేవతలను పూజించిరి" (యెహో. 24:2) అని యెహోషువ వారిగురించి ప్రస్తావించాడు. అర్థమయ్యేలాగా చెప్పాలంటే, వీరు మెసొపొతమియ దక్షిణ ప్రాంతంలో తమ చుట్టూ ఉన్న ఇతర ప్రజల్లాగే విగ్రహారాధికులు. కాబట్టి యెహోవా పిలుపు కేవలం కృప (పొందడానికి అర్హత లేనప్పటికీ పొందిన అనుగ్రహం) ద్వారానే; ఈ పిలుపు అబ్రాహాము దేవునినుండి విశేషమైన అనుగ్రహాన్ని పొందటానికి దేన్నైనా చేసినందువల్ల వచ్చిన ఫలితం కాదు (రోమా. 4:1–5). అబ్రాహామునుండి రాబోయే భవిష్య సంతతి దేవుని కృపను మరియు ఆశీర్వాదాల్ని పొంద డానికి అబ్రాహాము ఏమై ఉన్నాడో దేవునికి తెలుసు గనక ఇదే ఆయన అబ్రాహామును పిలిచిన కారణం (18:19).

కాబట్టి నేడు కూడా ఇదే: దేవుడు సువార్తద్వారా పాపుల్ని పిలుస్తున్నాడు (2 థెస్స. 2:13, 14), ఇది మనం ఎవరు, లేక మనం చేసినదేమి అని మన యోగ్యత మీద ఆధారపడిన పిలుపు కాదు. కచ్చితంగా ఇది, మనం క్రీస్తు పోలికలోనికి మార్పు చెందడానికి (2 కొరింథీ. 3:18) విశ్వాసంద్వారా కృపచేతనే (ఎఫెసీ. 2:8, 9) ఆయన పిలుపు. క్రీస్తులో పోలిక నూతన సృష్టిగా (2 కొరింథీ. 5:17) మన సత్ క్రియలతో మనం ప్రభువు వెలుగును ప్రసరిస్తూ వాటినిబట్టి ప్రజలు దేవుణ్ణి మహిమపర్చేలాగా మనం లోకానికి ఆశీర్వాద సాధనాలుగా

ఉండాలి (మత్తయి5:16; ఎఫెసీ. 2:10).

దేవుని పిలుపు విశ్వాసాన్ని పుట్టిస్తుంది. "విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము; దేవునియొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయ చేయువాడనియు నమ్మవలెను గదా" (హెబ్రీ. 11:6) అని హెబ్రీ పత్రిక రచయిత తెలియజేస్తున్నాడు. ఏకైక నిజ దేవుడు అబ్రాహాముకు ప్రత్యక్షమై, అతణ్ణి అతని సంతతిని, అతని ద్వారా చివరికి సర్వలోకాన్ని ఆశీర్వదిస్తానని ప్రకటించినప్పుడు ఈ సాక్ష్యమే విశ్వాసాన్ని పుట్టించింది (గలతీ. 3:8 చూడండి). ఈ విశ్వాసమే అతను ఊరు పట్టణాన్ని విడిచిపెట్టి, వాగ్దానపూర్వకమైన నూతన దేశానికి ప్రయాణం చేయడానికి తోడ్పడింది.

ఇదే ప్రకారం క్రొత్త నిబంధనలో పౌలు "వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాట వలన కలుగును" (రోమా. 10:17) అని ప్రకటించాడు. దేవుని మాటను వినడం వలన, అంటే దేవుడు యేసు క్రీస్తుద్వారా మానవాళికి ఏం చేశాడో ఏం చేయనున్నాడో తెలిపే సువార్తను వినడంద్వారా విశ్వాసం కలుగుతుంది.

దేవుడు తనగురించి అబ్రాహాముకు తానెవరో (ఏకైక నిజదేవుడు), ఆయన పితరునికొరకు ఏం చేయాలనుకుంటున్నాడో ప్రేమపూర్వకంగా వెల్లడిచేసి సువార్త (శుభసందేశం) ప్రకటించాడు. యెహోవా అబ్రాహాముతో "నిన్ను గొప్ప జనముగా చేసి నిన్ను ఆశీర్వదించి నీ నామమును గొప్ప చేయుదును, నీవు ఆశీర్వాదముగా నుందువు. నిన్ను ఆశీర్వదించువారిని ఆశీర్వదించెదను; నిన్ను దూషించువాని శపించెదను; భూమియొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదించబడును" (ఆది. 12:2, 3) అని వాగ్దానం చేశాడు. చివరగా, అబ్రాహాముకు అతని సంతతికి కనాను దేశాన్నిస్తానన్న దేవుని వాగ్దానం 12:7లోను, 13:14–17లలోను అతనికి నిశ్చయపూర్వ కంగా తెలిసింది; ఈ వాగ్దానం సూచనప్రాయంగా 11:31లోను, మరియు 12:1లోను కనబడుతుంది.

క్రొత్త నిబంధనలో, మొదటి శతాబ్దంలో అపొస్తలులు సువార్త (శుభసందేశం) ప్రకటించినప్పుడు దేవుడు యేసు క్రీస్తుద్వారా లోకాన్ని రక్షించడానికి ఏం చేశాడనేదే వారి బోధల్లో ఎప్పుడూ ప్రధానాంశంగా ఉండేది. వారు యేసు జీవితం మరియు కార్యాలు, ప్రాయశ్చిత్తార్థమైన ఆయన మరణం, భూస్థాపన, పునరుత్థానం, పరలోకానికి ఆరోహణం అన్నీ పాత నిబంధనలోని ప్రవచనాల నెరవేర్పు అని నొక్కి చెప్పారు. ఈ సంఘటనలన్నీ దేవుడు యేసును ప్రభువుగాను మరియు క్రీస్తుగాను (మెస్సీయ) చేశాడని తెలియజేస్తున్నాయి. పెంతెకొస్తు నాడు పేతురు బోధించిన సందేశం నిజంగా, "రక్షణ కలుగజేయుటకు దేవుని శక్తి" (రోమా. 1:16), ఎందుకంటే ఈ సందేశం ప్రజల్ని వారు తమ మెస్సీయను నిరాకరించినందుకు నొచ్చుకొనేలా చేసి (అపొ. 2:14–36), వారి

హృదయాల్లో విశ్వాసాన్ని పుట్టించింది (రోమా. 10:17). ప్రజలు, "సహోదరులారా, మేమేమి చేతుము?" (అపో. 2:37) అని అడిగినప్పుడు పేతురు, "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు" (అపో. 2:38) అని ప్రత్యుత్తరమిచ్చాడు.

మారుమనస్సు మరియు బాప్తిస్మమే సువార్త కాదు; ఇవి సువార్త విని తాము అపరాధులమని గుర్తించినవారికి, ఎలా సువార్తపట్ల విశ్వాసంతో ప్రతిస్పందించాలో తెలుసుకొనవలసి ఉన్నవారికి ఇవ్వబడిన ఆజ్ఞలు మాత్రమే. రక్షణార్థమైన విశ్వాసం ఎప్పుడూ విధేయతాపూర్వకమైన విశ్వాసమే; దేవుడు తన కుమారుడైన యేసు క్రీస్తు ద్వారా సర్వమానవాళికొరకు ఏం చేశాడో తెలిపే సువార్తను వినిన పాపులు మారుమనస్సు మరియు బాప్తిస్మంద్వారా ప్రతిస్పందిస్తారు. మంచి పనులు చేసినందువలన రక్షణ లభించదు; మనుషులందరి పాపాల్ని తీసివే యడంకొరకు క్రీస్తు చేసినదాన్నిబట్టి రక్షణ లభిస్తుంది. రక్షణను, "విశ్వాసమునకు విధేయత"గా పౌలు వర్ణించాడు (రోమా. 1:5).

*దేవుని పిలుపు వ్యక్తిగతమైనది, ఇది విధేయత అత్యావశ్యకమైన పిలుపు.* అబ్రాహాముకు మొదటి పిలుపు అతను ఊరులో ఉన్నప్పుడు వచ్చింది (దక్షిణ మెసొపొతమియ; 15:7). దేవుడు పలికిన మాట ఒక్కటే ఈ పిలుపు కాదు గానీ, స్తెఫను మాటల ప్రకారం (అపో. 7:2) ఇది మహిమ (దేవుని ప్రత్యక్షత) కూడా. అబ్రాహాము అతని ఇంటిని దేశాన్ని ఇంటివారిని (పరివారం) బంధువర్గాన్ని విడిచిపెట్టి తాను చూపించబోయే దూరంలో ఉన్న క్రొత్త దేశానికి వెళ్లాలనే (అపో. 7:3; మరియు, అది. 12:1 చూడండి) అవశ్యాభ్యర్థన కష్టతర మైంది కాబట్టి ఈ పిలుపు అవసరమే. ఆ సమయంలో అబ్రాహాము బహుదేవతారాధన చేసేవాడు కాబట్టి, యెహోవా తానే నిజమైన ఏకైక దేవుడని అబ్రాహాము తెలుసుకొనేలా చేయడానికి, మరియు ఆయన అకస్మాత్తుగా అబ్రాహామును పిలుస్తున్నాడు గనుక అబ్రాహాము తన గతంతో సంబంధాలు తెంచుకొని విశ్వాసం ద్వారా నడవడం ప్రారంభించడానికి దేవుడు తనను తాను వెల్లడిచేసుకొనడం ముఖ్యం. పితరుడు తన మనస్సులో ఎటువంటి చంచలమైన ఆలోచనలు లేకుండా, అదంతా ఒక భ్రమ అని తలంచకుండా దృఢచిత్తుడై ఉండడం అవసరం.[22]

ఇంకా అబ్రాహాము విశ్వాసంలోను విధేయతలోను వృద్ధిచెందాలి. అతని విశ్వాసం జయాపజయాల అనుభవాలతో బలంగా వృద్ధిచెందడానికి, విధేయతద్వారా పరిపూర్ణమవడానికి చాలా సంవత్సరాలు పడు తుంది (రోమా. 4:20; యాకోబు 2:22). అబ్రాహాము ఊరు పట్టణంలో ఉన్నప్పుడు వాగ్దానదేశానికి దూర ప్రయాణం ప్రారంభించడానికి అవసరమైన (తగిన) విశ్వాసం అతనిలో ఉంది. అతని విశ్వాసం అతనిచేత ముందుకు అడుగులు వేయించింది; అయితే తన ఇంటివారిని (పరివారం) విడిచిపెట్టడానికి తగిన విశ్వాసం గానీ,

వారిని దూరంలో ఉన్న కనాను దేశానికి తీసుకొని వెళ్లడానికి అవసరమైనటువంటి బలమైన విశ్వాసం గానీ అతనిలో లేవు. అతను, అతనితోపాటు అతని పరివారం మార్గమధ్యంలో ఒక చోట ఆగి అక్కడ స్థిరపడ్డారు; ఆ ప్రదేశం మెసొపొతమియ వాయవ్య ప్రాంతంలోని హారాను.

వాగ్దాన దేశానికి ప్రయాణమైన అబ్రాహాము తన గమ్యస్థానం ఇంకా నాలుగువందల మైళ్లు ఉండగానే ఆగిపోవడానికి యెహోవా అనుమతి ఉందని చెప్పడానికి లేఖనాల్లో సూచనలేమీ లేవు. అతను, అతని పరి వారం చాలా కాలం హారానులో నివసించారు, ఎంత కాలమంటే దాదాపుగా ఇదే వారి దేశమయ్యింది (12:1). పితరుని తండ్రి తెరహు మరణం తర్వాతనే, దేవుడు అబ్రాహామును అతని దేశాన్ని బంధువర్గాన్ని పరివారాన్ని విడిచిపెట్టి కనానుకు వెళ్లడానికి మళ్లీ పిలిచాడు (12:1, 5). అప్పటికి, అబ్రాహాము వయసు డెబ్బయి అయిదు సంవత్సరాలు. శారా వయసు అతని వయసుకంటె పది సంవత్సరాలు తక్కువ (12:4; 17:17). దేవుడు అబ్రాహామును ఊరు పట్టణంలో పిలిచినప్పుడు అతని వయసు ఎంతో మనకు తెలియదు. అయితే అబ్రాహాము వయసు అప్పటికి ముప్పయి లేదా నలబై సంవత్సరాలుండవచ్చని కొందరి అభిప్రాయం. అదే నిజమైతే, అతను తన వయసులో సగభాగం ఉండకూడని స్థలంలో (హారాను) గడిపినట్లే.

దేవుని పిలుపు విన్న వెంటనే (12:1–3), అబ్రాహాములో విశ్వాసం చిగురించింది;అతను కనాను దిశగా ప్రయాణం చేశాడు. మరొకసారి అతను తన పరివారాన్ని అక్కడే విడిచిపెట్టకుండా, తనతోబాటు తీసుకొని బయలుదేరాడు (12:4, 5). శారా ఇంకా గొడ్రాలు గనక, అబ్రాహాముకు కుమారుడు గానీ వారసులు గానీ లేరు. అతను తన అన్న కుమారుడైన లోతును, ఇంకా తమ సేవకులందరిని (బహుశా బానిసలు కావచ్చు) తమతోబాటే వెంటబెట్టుకొని విస్తారమైన పశువుల మందలతో ప్రయాణం మొదలు పెట్టాడు.

అబ్రాహాము అతని పరివారం “విశ్వాసము ద్వారానే” చివరికి కనాను దేశం చేరుకున్నారు (హెబ్రీ. 11:8). పితరుడు విశ్వాసంలోను విధేయతలోను కృపలోను సత్యం గురించిన జ్ఞానంలోను ఇంకా వృద్ధిచెంద వలసి ఉన్నాడు, ఎలాగంటే ప్రభువుయొక్క అపొస్తలుల్లాగానే (మత్తయి 17:20; మార్కు 4:40; లూకా 17:5, 6). ప్రస్తుతకాలంలోనైనాసరే, దేవుని ప్రజలైనవారందరికీ ఇదే సవాలు ఎదురవుతుంటుంది. సువార్త పిలుపుపట్ల విధేయత చూపి క్రైస్తవులైనవారందరూ ప్రభువుతో నడవడానికి మరియు విశ్వాసంలో వృద్ధిచెందడానికి ప్రయత్నం ప్రారంభించాలి (మత్తయి 28:19, 20; మార్కు 16:15, 16; 1 పేతురు 2:1, 2; 2 పేతురు 3:18).

*దేవుడు కనానులో అబ్రాహామును మళ్లీ పిలిచాడు, ఈ పిలుపు అతనికి దైవారాధన గురించి బోధపర్చింది.* అబ్రాహాము వాగ్దాన దేశంలో ప్రవేశించి షెకెము

చేరుకున్నప్పుడు (కనాను మధ్య ప్రాంతం), ఆ ప్రాంతమంతా కనానీయుల అధీనంలో ఉందని అతనికి తెలిసింది (12:6). అప్పుడతను ఈ ప్రదేశం ఎలా తన సంతతి వారికి చెందుననే ఆశ్చర్యంతో ఆత్మలో కృంగిపోయి ఉండవచ్చు. అతనిలో విశ్వాసాన్ని పెంపొందించడానికి మరియు అతని చింతల్ని పారద్రోలడానికి అతనికి "యెహోవా ప్రత్యక్షమయి" అతని "సంతానమునకు" దేశాన్నిస్తానని వాగ్దానం చేశాడు. ఇది అతనికి మనోబలాన్నిచ్చింది; అతని విశ్వాసం ఎంత బలపడిందంటే, "అతడు తనకు ప్రత్యక్షమైన యెహోవాకు ఒక బలిపీఠమును" కట్టించాడు (12:7). అతని సాహసోపేతమైన చర్య అతను షెకెములో అన్యదేవతలకు సంబంధించిన బలిపీఠాల వద్దకు దైవారాధనకు వెళ్లలేదని,[23] అతను మెసొపొతమియనుండి ఈ క్రొత్త దేశానికి రావడానికి తనను పిలిచిన యెహోవాను మాత్రమే ఘనపరుస్తాడని నిరూపించి చూపించింది.

అబ్రాహాము ఆ దేశమంతా సంచరించి, బేతేలుకు హాయికి మధ్య "గుడారము వేసి", అక్కడ దేవునికి మరొక బలిపీఠాన్ని కట్టి "యెహోవా నామమున ప్రార్థన" చేసి దేవుణ్ణి ఆరాధించాడు (12:8). పితరుడు కనానులో ఎక్కడ సంచరించినా, తన అలవాటు ప్రకారం అక్కడ గుడారం వేసికొని ఆరాధనకు బలిపీఠాన్ని నిర్మించాడు (12:7, 8; 13:3, 4, 18). గుడారం, "అన్యుల దేశములో ఉన్నట్టుగా వాగ్దత్త దేశములో పరవాసు" లుగా ఉన్నారనే వాస్తవానికి సాక్ష్యం పలుకుతుంది (హెబ్రీ. 11:8, 9); అతనక్కడ తన కుటుంబం నివసించడం కొరకు శాశ్వతమైన భవంతిని కట్టుకొనలేదు. బలిపీఠం, యెహోవా యందలి అతని విశ్వాసానికి మరియు అంతవరకు తన జీవితాన్ని నిర్దేశించిన మెసొపొతమియనుండి, అన్య సంస్కృతినుండి తనను వెలుపలికి పిలిచిన దేవుని పిలుపుపట్ల కృతజ్ఞతకు సాక్ష్యం.

పితరుడు ఆరాధనకొరకు బలిపీఠాలు నిర్మించినా అక్కడ విగ్రహాలు లేకపోవడాన్ని ఇరుగుపొరుగువారైన కనానీయులు గమనించే ఉండవచ్చు. ప్రత్యేకంగా ఇది మాత్రమే పవిత్రమైనస్థలం అని అతను ఏర్పరచుకొనలేదు; అయితే అతనెక్కడ తన గుడారాన్ని వేసుకొని, బలిపీఠాన్ని నిర్మించాడో అక్కడే యెహోవా నామంలో ప్రార్థించాడు. ఇది, యెహోవా ఏదో ఒక ప్రదేశానికి లేక ప్రాంతానికి మాత్రమే పరిమితమైన స్థానిక దైవం కాదని ప్రాముఖ్యంగా సూచిస్తున్నది; కనానీయుల్లో తమ దేవతలు ఏదో ఒక ప్రదేశానికి మరియు కాలానికి పరిమితమైన దైవాలు అనే భావన ఉండేది. ఎక్కడైనా సరే బహిరంగంగా దేవుణ్ణి ఆరాధించగల అబ్రాహాము సత్తత (సత్తువ), యెహోవా నిజంగా ఎక్కడైనా ఉండగల ఆత్మ అని సర్వలోకానికి ప్రకటించింది. తన చుట్టూ ఉన్న అన్యప్రజలు తనను చూస్తున్నప్పటికీ అతను దేవుణ్ణి బహిరంగంగా ఆరాధించడానికి బిడియం చూపకపోవడం అబ్రాహాములో ఉన్న గణనీయమైన గుణం. తనను పిలిచి తనను ఆశీర్వదిస్తానని వాగ్దానం చేసి కనానీయులు నివసించిన దేశంలో తనకొక నూతన

ప్రారంభాన్ని నూతన గమ్యాన్నిచ్చిన దేవునిలో అతనికున్న విశ్వాసానికి అతని చర్యలే సాక్ష్యం.

నేడు ప్రభువు మనల్ని అబ్రాహాములాగా మన బంధువుల్ని విడిచిపెట్టి దూరదేశానికి వెళ్లి "పరదేశులమును యాత్రికులమునై" (హెబ్రీ. 11:13) ఉండడానికి పిలవటం లేదు. ప్రభువు మనల్ని సువార్త ద్వారా పిలుస్తున్నాడు (2 థెస్స. 2:14); మనం గుర్తు పెట్టుకొనవలసినది మనం ఎక్కడ నివసించినప్పటికీ మనం ఈ లోకానికి చెందినవారం కాదని ఈ లోకం మన శాశ్వత నివాసం కాదనే విషయం. శారీరక శోధనలకు మనం విముఖంగా ఉండాలి, మనల్ని మనతో ఉన్నవారిని క్రిందకులాగి పడవేసే ఇహలోకసంబంధమైన వాటివెనక పరుగెత్తడం మానుకోవాలి. "సుళువుగా చిక్కులబెట్టు పాపమును" (హెబ్రీ. 12:1) మనం విడిచిపెట్టి, "సంపూర్ణులమగుటకు సాగిపోవాలి" (హెబ్రీ. 6:1). మనం ఎక్కడో ఒక చోట సుఖమయమైన జీవితం కోరుకొనకుండా, "ఈ లోకమర్యాదను అనుసరింపక" (రోమా. 12:2) అబ్రాహామును పోలి ఉండాలి. "పరదేశులును యాత్రికులు"గా (1 పేతురు 2:11) మన దేశం కాని దేశంలో, మనం మన నిజమైన శాశ్వత నివాసం మరియు స్వాస్థ్యం "పరలోకమునందు" (ఫిలిప్పీ. 3:20; హెబ్రీ. 11:10, 15, 16) ఉన్నాయనే విషయాన్ని గుర్తుంచుకొనాలి.

## విశ్వాసం కలిగిన వ్యక్తి యొక్క కష్టాలు (12:10–20)

అబ్రాహాము తన విశ్వాసం విషయంలో ప్రగాఢమైన నిబద్ధతను పెంపొందించుకొనడానికి కొంతకాలం పట్టింది. అతని విధేయతను మనం చూశాం; అది అసంపూర్ణమే అయినప్పటికీ క్రమక్రమంగా నిలకడ విషయంలో దృఢంగానే ఉంది. అయితే, శ్రమ శోధన భయం మరియు నైతికలేమి మొదలైనవి ఎదురైనప్పుడు అతనిలో దేవునిమీద భరోసా సన్నగిల్లినట్టుగా తెలుస్తున్నది. అబ్రాహాము విశ్వాసమూలంగానే చాలా కాలం ప్రయాణంచేసి చివరికి వాగ్దానదేశంలో ప్రవేశించాడు. అబ్రాహాము తాను ఊరును హారానును విడిచిపెట్టడం జరిగింది కాబట్టి తన కుటుంబంలోని పలు సమస్యల్ని తాను అధిగమించానని, కనాను చేరుకొనడానికి తాను చేసిన కష్టతరమైన సుదీర్ఘప్రయాణం ఇక ముగిసిందని తలంచి ఉండవచ్చు. అయితే తన కష్టకాలం ముగిసి పోలేదని అతను తెలిసికొనడానికి ఎంతోకాలం పట్టలేదు. అతను కనాను విడిచి వెళ్లే లాగా క్రొత్త కష్టాలెదురయ్యాయి; చివరికి అతని భార్య శారా విషయంలో అతని కపటం అతని భవిష్యత్తును అపాయంలోకి నెట్టింది.

దేవుడు తన ప్రజలకెందుకు కష్టాల్ని శ్రమల్ని అనుమతిస్తాడనే విషయంలో దేవుని బిడ్డల్లో తరచుగా అలజడి కలుగుతుంటుంది. దేవుని విశ్వాసం ఉంచిన వ్యక్తి కొన్నిసార్లు కష్టాలనుభవించడం, భక్తిహీనులు వర్ధిల్లుతుండడం చూచిన కీర్తనకారుడు కూడా ఈ విషయంలో సందిగ్ధం వెలిబుచ్చాడు (కీర్తనలు 73:2–14;

మరియు, యోబు 1:1–3:26 చూడండి). పరమార్థిక (ఆత్మసంబంధమైన) విషయాల్లో ఉన్నతప్రమాణాల్ని అనుభవించిన వారి జీవితంలో దేవుడు వారికి తనగురించి తాను వెల్లడిచేసుకొని, వారి విషయంలో న్యాయం చేసిన సందర్భాలు, లేదా వారిని గొప్ప అపాయాలనుండి రక్షించిన సందర్భాలున్నాగానీ వారు కూడా కష్టాల్ని పరీక్షల్ని అనుభవించిన దృష్టాంతాలను లేఖనాలు వివరిస్తున్నాయి.

ఐగుప్తు బానిసత్వం నుండి ఇశ్రాయేలు ప్రజల విడుదల విషయంలో ఈ నమూనా నిర్గమకాండములో ప్రధానమైన దృష్టాంతంగా కనబడుతుంది. దేవుడు ఇశ్రాయేలీయుల్ని ఐగుప్తు సైన్యంనుండి కాపాడి ఎర్ర సముద్రం గుండా వారిని క్షేమంగా వెలుపలకు నడిపించిన తర్వాత, సంతోషదాయకమైన గొప్ప రక్షణానుభవం అతి త్వరలోనే అరణ్యంలో పరీక్షకు గురియైంది. మొదటగా, వారు త్రాగడానికి చేదునీళ్లు కనిపించాయి (నిర్గమ. 15:22–27), తర్వాత వారికి ఆకలిబాధ ఎదురైంది (నిర్గమ. 16:1–36), చివరకు అసలు నీళ్లే లేవు (నిర్గమ. 17:1–17). ఇశ్రాయేలీయులకు పరీక్ష ఎదురైన ప్రతి సారీ, వారు తమకు కావలసినవాటి విషయంలో యెహోవాయందు నమ్మిక చూపడంలో తప్పిపోయారు. వారు తమకు దేవుని ప్రతినిధియైన మోషేకు వ్యతిరేకంగా సణిగి దేవునికి వ్యతిరేకంగా పాపం చేశారు. (సంఖ్యా. 14:22 చూడండి).[24] విశ్వసించినవారికి అనేక విధాలుగా వచ్చే పరీక్షల గురించి వారి ప్రయాణాల్లో పలు వృత్తాంతాలు కనబడతాయి.

*ప్రతికూల పరిస్థితులవలననైన పరీక్ష.* కనానులో పితరుడికి కరవు అనే పరీక్ష ఎదురైంది. అతనక్కడ ఎక్కువ కాలం ఉండలేదు. అబ్రాహాముతోబాటు ఉన్నవారికి, అతని పశువులకు మందలకు కరవు మూలంగా నీటివసతి లోపించింది. అబ్రాహాము ఇటువంటి పరీక్షను అతను ఊరులో ఉన్నప్పుడు గానీ, హారానులో ఉన్నప్పుడు గానీ ఎదుర్కొన్నట్టు లేఖనాల్లో ఎక్కడా లేదు; అయితే అతను దేవుడు చూపించిన దేశానికి వచ్చి నివసించినప్పటికి సమస్య ఎదురైంది.

ఈ కరవు ఎంత తీవ్రమైనది లేదా ఎంత కాలం ఉంది అనే వివరాలు మనకు లభ్యం కావు. తర్వాత కాలంలో మరొక సంఘటన, యాకోబు తన కుమారులతోబాటు బెన్యామీనును కూడా పంపించి షిమ్యోనును చెరనుండి విడిపించడానికి ముందు సుమారు రెండు సంవత్సరాల బాటు ఐగుప్తునుండి వచ్చిన ఆహార ధాన్యాలతో తన కుటుంబాన్ని తన పశువుల మందల్ని కనానులో ఉండి పోషించుకున్నాడు (41:56–43:23). వారు ఐగుప్తు దేశానికి తిరిగి వెళ్లేటప్పుడు కనానులో తీవ్రమైన కరవు ఉన్నప్పటికీ, ప్రచ్ఛన్నంగా కనిపించిన అధికారి యోసేపుకొరకు వారు కానుకల్ని తీసుకొని వెళ్లారు. వారు అతనికి గుగ్గిలం తేనె మస్తకి బోళం పిస్తాచ కాయలు బాదంకాయలు తీసుకొని వెళ్లారు (43:11). ఇవి వారివద్ద ఉండడం అక్కడ కొన్ని రకాల పదార్థాలున్నాయనీ, అయితే ప్రజల ముఖ్యాహారమైన రొట్టెలకొరకు తృణధాన్యాలు

లేవు కాబట్టి యాకోబు కొరత ఎదుర్కొని ఉండవచ్చని తెలియజేస్తుంది. ఈ కరవుకు, అబ్రాహాము కాలంనాటి కరవుకు ఎటువంటి పోలిక ఉంది? ఈ వివరాలు మనకు లభ్యం కావు.

అబ్రాహాము కనాను దేశం చేరుకున్నప్పుడు అతని ప్రజలకు అతని పశువుల మందలకు అవసర మైనటువంటి ఆహారం నీటివసతి అక్కడ ఉన్నాయి; అయితే అతనికిప్పుడు కరవు కారణంగా జీవనానికి ముఖ్యమైనవెలా లభిస్తాయి? ఆ ప్రాంతమంతా కరవు వ్యాపించి, చాలా కాలం ఉన్నట్లయితే తప్పకుండా అబ్రాహాము ఆస్తిపాస్తులకు పశువుల మందలకు, అతని భవిష్యత్తుకు ప్రమాదం వాటిల్లుతుంది. అతను ఏం చేయాలి? అతడు ఈ విషయమును దేవుని దగ్గరకు తీసుకొని వెళ్లి ఆయన సహాయం కొరకు వేడుకొన్నట్లు లేక కరువును ఆపి వర్షము పంపమని ప్రార్థన చేసినట్లుమనకు ఎలాంటి సూచన కనిపించదు. “తనకు తాను సహాయం చేసుకున్నవారికి దేవుడు సహాయం చేస్తాడు”[25] అను నియమమును అబ్రాహాము అనుసరించువాడు కావచ్చు; ఇటువంటి సమయంలో సహేతుకమైన నిర్ణయం తీసుకొనవలసిన బాధ్యత తనదేనని అబ్రాహాము తలంచి వాగ్దానదేశాన్ని విడిచిపెట్టి ఐగుప్తుకు వెళ్లి నివసించాడు. అయితే అతని నిర్ణయం చాలాకాలం తర్వాత జ్ఞానియైన ఒక వ్యక్తి పరిశీలనను మనకు జ్ఞప్తికి తెస్తుంది: “ఒకని యెదుట సరియైనదిగా కనబడు మార్గము కలదు, అయితే తుదకు అది మరణమునకు త్రోవతీయును” (సామెతలు 14:12). కనాను విడిచిపెట్టి ఐగుప్తుకు వెళ్లి నివసించాలని అబ్రాహాము నిర్ణయించుకున్నప్పుడు అతనికి అతనితోబాటు ఉన్నవారికి మరణాపాయం కలగలేదు గానీ, అతని విషయంలో యెహోవా మధ్యలో జోక్యం చేసికొనక పోయినట్లయితే తేలిగ్గానే మరణాపాయం ఎదురై ఉండేది (12:17).

సహజంగానే తలెత్తే ప్రశ్న అపరిష్కృతంగానే ఉంది: దేవుడు తన ప్రజలకు శ్రమలనెందుకు అనుమతిస్తాడు? మన విశ్వాసానికి ఎదురయ్యే పరీక్ష, బంగారాన్ని మండుతున్న కొలిమిలో శుద్ధిచేసి మలినాలన్నిటినీ వేరుచేసే అగ్నిపరీక్షవంటిదని (1 పేతురు 1:7) అపొస్తలుడైన పేతురు చెప్పాడు. శ్రమల ననుమతించడంలో దేవుని ఉద్దేశం మన విశ్వాసాన్ని ధృవీకరించడానికి మాత్రమే కాదు, మనలోని మడ్డిపదార్థాల్ని మాలిన్యాల్ని (అవిశ్వాసం, అపనమ్మిక) తొలగించి మనల్ని శుద్ధిచేయడం కొరకు కూడా. ఒకానొక సందర్భంలో ఒక వ్యక్తి యేసుతో, “నమ్ముచున్నాను, నాకు అపనమ్మకముండకుండ సహాయము చేయుము” (మార్కు 9:24) అని చెప్పాడు. కొందరి అభిప్రాయాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నప్పటికీ, విశ్వాసం ఉన్న హృదయాల్లో కూడా అపనమ్మిక ఉండగలదని తెలుస్తున్నది. హెబ్రీ పత్రిక రచయిత, “విశ్వాసమునుబట్టి వారు (ఇశ్రాయేలీయులు) ... ఎఱ్ఱ సముద్రములో బడి నడిచిపోయిరి” (హెబ్రీ. 11:29) అని చెప్పాడు; అయినా వెంటనే అరణ్యంలో వారిలో అపనమ్మిక ఎలా కనిపించిందో

గదా! దేవునిమీద వారి హృదయాల్లో నమ్మిక లోపించడం వారు కనాను దరికి చేరేవరకు కొనసాగుతూనే ఉంది (సంఖ్యా. 14:11). అదే ప్రకారం, యేసు శిష్యులు అయణ్ణి నమ్మి తన వలల్ని తమ వ్యాపకాల్ని వదిలి ఆయనను వెంబడించినప్పటికీ, వారి హృదయాల్లో ఎక్కడో ఒక చోట అపనమ్మిక కూడా కనబడింది. వారిలోని ఈ భయసందేహాలు యేసును పట్టుకున్నప్పుడు ఒక్కసారిగా బయటపడ్డాయి; పేతురు యేసు ఎవరో తనకు తెలియదని చెప్పాడు, తక్కిన శిష్యులు రాత్రంతా కనబడకుండా పారిపోయారు (మత్తయి 26:56; మార్కు 14:66–72).

విశ్వాసాన్ని పెంపొందించుకొనడం శరీరంలోని కండల్ని లేక కండరాల్ని పోలి ఉంటుంది. కండలు లేక కండరాలు గట్టిపడాలన్నా లేక పెరగాలన్నా ఒకే ఒక మార్గం కఠినవ్యాయామం; ఆధ్యాత్మికంగా విశ్వాసం (విశ్వాసమనే కండరం) జీవితంలో ఎదురయ్యే క్లిష్టమైన అనుభవాలద్వారా మాత్రమే గట్టిపడగలదు. కొంతమందిలో అతి తక్కువ కాలంలో విశ్వాసం బలంగా వృద్ధి చెందుతుంది; అయితే అబ్రాహాములాగా మనలో చాలామందిలో మనల్ని మనం కాపాడుకొనడానికి, “దుష్టుని అగ్నిబాణములన్నిటిని ఆర్పుటకు శక్తిమంతు” లగునట్లు డాలు వంటి విశ్వాసాన్ని (ఎఫెసీ. 6:16) పెంపొందించుకొనడానికి చాలా కాలం పడుతుంది.

*అబద్ధమాడాలనే శోధన తన స్వీయరక్షణ కొరకు.* పితరుడు కరవునుండి తప్పించుకొనడానికి కనానును విడిచిపెట్టి వెళ్లాడు. కరవు ఎంత తీవ్రంగా ఉంది, లేక కరవు ఎంత కాలం కొనసాగింది అనేది కాదు గానీ, అతను ఒక సమస్యనుండి తప్పించుకొని అంతకంటె చెడ్డదైన మరొక సమస్యను మీదకు తెచ్చుకున్నాడు. ఎవరైనా ఒక వ్యక్తి ఒక పరీక్షను తప్పించుకొని పారిపోవాలనుకున్నప్పుడు, లేక ఆ పరీక్షనెదుర్కొనడానికి నిరాకరించిన ప్పుడు మరి కొన్ని పరీక్షలెదురవుతాయి. అబ్రాహాము ఈ సమస్యను యెహోవాదగ్గరకు తీసుకొని వెళ్లడం జరిగిందో లేదో ఎటువంటి ప్రస్తావన లేదు; అయితే అతను ఐగుప్తులో సమృద్ధిగా ఆహారధాన్యాలున్నాయనే వార్తను, అక్కడికి వెళ్లవచ్చనే సలహాల్ని తన తోడి ప్రయాణికులనుండి విని ఉండవచ్చు. అతను ఐగుప్తు సమీపానికి వెళ్లిన వెంటనే, అతణ్ణి మరోభయం చుట్టుముట్టింది; ఇది, అక్కడి స్థానికులు సుదూర ప్రాంతాలనుండి వచ్చిన ప్రయాణీకుల్ని చంపివేసి వారివద్ద ఉన్నవాటిని దోచుకొని వారి భార్యల్ని పట్టుకొని తీసుకొని వెళ్తారనే సంగతి విన్నందున కలిగిన భయం. అందుచేత, అబ్రాహాము తన భార్య శారాను తన సహోదరిగా ఐగుప్తీయులకు పరిచయం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇది కొంతమటుకు నిజమే అయినా (20: 1, 2, 12, 18), ఇది ఉద్దేశపూర్వకమైన కపటమే; మరియు ఇది హేయమైన లేక నిందార్హమైన ఉపాయమే (సాకు). దీనివలన దేవుని వాగ్దానం నిలిచిపోగల ప్రమాదం (అంటే ఇస్సాకు జననం) పొంచి ఉంది. దీనితో బాటు, ఇది పితరునిలో

ఉన్న స్వార్థచింతనను కూడా బయటపెట్టింది "నీవలన నాకు మేలు కలుగునట్లును నిన్ను బట్టి నేను బ్రదుకునట్లును నీవు నా సహోదరివని దయచేసి చెప్పుమని" (ఆది. 12:13) అనడంలో అబ్రాహాము ముఖ్యంగా తనలో ఉన్న భయాన్ని వెలిబుచ్చాడు. "నీవలన" "నిన్నుబట్టి" అనే మాటలు, అన్ని వేళల్లోను భార్యను ప్రేమించి పోషించి సంరక్షించాలనే భావనకు విరుద్ధంగా ఉన్నాయి కదా (ఎఫెసీ. 5:25–29 చూడండి).

శారాయొక్క తండ్రి అప్పటికి బ్రతికిలేడు గనక, మరియు అబ్రాహాము తాను ఆమెకు సహోదరుణ్ణి అని చెప్పుకున్నాడు కాబట్టి ప్రాచీన కాలంనాటి వ్యవహారపద్ధతుల ప్రకారం ఆమెను భార్యగా తీసుకొనివెళ్లినవారు అతనికి శుల్కం చెల్లించాలి. ఇది అబ్రాహాము కపటంతో చేసిన పనికి మరొక ముళ్లుగా మారింది: మొదటగా, అబ్రాహాముకు ప్రాణగండం తప్పింది; రెండవదిగా, ఈ పని వలన అతనికి కొంత ధనలాభం చేకూరింది. నిజానికి, ఫరో శారాను తన అంతఃపురంలోకి తీసుకున్నపుడు అక్షరాలా జరిగినది ఇదే: అతను పితరుడికి గొఱ్ఱెల్ని ఎద్దుల్ని గాడిదల్ని ఒంటెల్ని దాసదాసీజనాన్ని శుల్కంగా ఇచ్చాడు (12:16).

ఫరో ఇంటిమీదికి తీవ్రమైన వేదనలు వచ్చినప్పుడు అతను తాను మోసపోయానని గ్రహించాడు. అప్పుడు రాజు అబ్రాహామును అతని కపట ప్రవర్తనకుగాను పౌరుషంగా మాట్లాడి అతణ్ణి ఐగుప్తునుండి వెలుపలికి పంపివేశాడు. ఒక అన్యరాజు అబ్రాహాముతో పౌరుషపదజాలంతో మాట్లాడి అబ్రాహాము కపటచర్యను బయటపెట్టినందుకు, అతని ఆత్మాభిమానానికి పెద్ద దెబ్బ తగిలి ఉండవచ్చు. ఇది మనసును నులిపెట్టే బాధకరమైన అనుభవమైనప్పటికీ అవసరమైనదిగానే కనబడుతున్నది. ఎందుకంటే, భావికాలంలో విశ్వసించిన వారందరికి తండ్రిగా పేరుపొందబోయే వ్యక్తికి తాను తన స్వంత ఆలోచనల మీద ఆధారపడడం కంటె యెహోవా మీద ఆధారపడాలని బోధపడి ఉంటుంది.

ఇటువంటి వృత్తాంతాలు విశ్వాసులకు ఇబ్బందిగా (చికాకుగా) ఉంటాయి. మనం కథానాయకులు ఉదాత్తగుణాలున్న వ్యక్తులని, వారు వీరోచిత కార్యాలే చేస్తూ అందరిలో ప్రకాశవంతంగా కనబడతారు తప్ప వారిలో ఎటువంటి ఆధ్యాత్మిక పగుళ్లు (లోటుపాట్లు) ఉండవని భావిస్తూ వారిని ఎత్తైన పీఠంమీద కూర్చోబెడుతుంటాం. అయితే, దేవుడు తన సేవకులుగా ఉండడానికి పిలుచుకున్నవారి పాపాల విషయంలో (తప్పులు, పొరబాట్లు, దోషాలు) పక్షపాతం లేకుండా వ్యవహరిస్తాడని బైబిలు తెలియజేస్తుంది. బైబిలు వారి వైఫల్యాల్ని కప్పిపుచ్చి పైపైన మెరుగులు పూయదు. మోషే (సంఖ్యా. 20:1–13), దావీదు (2 సమూ. 11:1–12:14), సొలొమోను (1 రాజులు 11:1–43) మొదలైనవారి బలహీనతల గురించి, మరియు అపొస్తలుల బలహీనతల గురించి మనం బైబిల్లో చదువుతాం. బైబిల్లోని వ్యక్తుల బలాబలాల గురించి ఉన్న వృత్తాంతాలు వాస్తవానికి ఆ వృత్తాంతాలకు నమ్మకాన్ని జోడిస్తాయి. మనిషియొక్క పాపాల్ని వైఫల్యాల్ని

చిన్నవి చేసి చూపించడం వలన మనిషిలోని ఏదో ఒక కోణం మాత్రమే బహిర్గతమవుతుంది; బైబిలు ఇటువంటి పని చేయడం లేదు.

దీనికి తోడు, ప్రతి తరంలోను విశ్వసించినవారికి హెచ్చరికలుగా ఉండడంకొరకు బైబిల్లోని వ్యక్తుల పాపాలగురించి బైబిల్లో నిష్కపటంగా వివరించడం జరిగింది. దేవుని ప్రజలు కొన్నిసార్లు అమితమైన ఆత్మవిశ్వాసంతో ఉండడం జరుగుతుంటుంది; శోధనల్ని దరిచేరనియ్యని బలం తమకుందని, తమ లోతైన ఆధ్యాత్మికత వలన తాము పాపానికి బానిసలు కాబోమని వారు ఆలోచించడమే ఇందుకు కారణం. మత్తయి 26వ అధ్యాయంలో యేసు ప్రభువు, "మీలో ఒకడు నన్ను అప్పగించునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" అని చెప్పాడు; అప్పుడు ప్రతి ఒక్కరూ "నేనా" అని అడగడంలో ఎవరికి వారు తాము కాదనే అభిప్రాయాన్ని వెలిబుచ్చినట్లయింది (మత్తయి 26:21, 22). ముఖ్యులైన అపొస్తలుల్లో ఒకరైన పేతురు ప్రభువుతో, "నీ విషయమై అందరు అభ్యంతరపడినను నేను ఎప్పుడును అభ్యంతరపడను" అని చెప్పినప్పుడు ఆయన, "ఈ రాత్రి కోడి కూయక మునుపే నీవు నన్ను ఎరుగనని ముమ్మారు చెప్పెదవు" అని అతనికి ప్రత్యుత్తర మిచ్చాడు (మత్తయి 26:33, 34). చివరకు పేతురు ప్రభువుతో, "నేను నీతో కూడ చావవలసి వచ్చినను, నిన్ను ఎరుగను అని చెప్పను" అని చెప్పాడు. అదే ప్రకారం శిష్యులందరు కూడా చెప్పడం జరిగింది (మత్తయి 26:35); అయితే ఈ విషయాన్నెవరూ పెద్దగా పట్టించుకొనరు. యేసుతో బాటు మూడు సంవత్సరాలున్న శిష్యుల వైఫల్యం గురించి ఇక్కడ ప్రస్తావించడం దేవుని ప్రజలు శోధనకున్న బలవంతపు పట్టును తేలిగ్గా తీసి పడవేయకూడదని చెప్పడానికే. శోధనకున్న పట్టుకు ఎవరూ మినహాయింపు కారు.

పౌలు ఇటువంటి హెచ్చరికనే కొరింథులోని సహోదరులకు చేశాడు; బహుశా వారు తమకున్న ఆధ్యాత్మిక వరాల్నిబట్టి (కృపావరాలు) అతిశయిస్తూ, అవి వారికున్నందున ఎటువంటి శోధన తమను లొంగ దీయలేదని ఆలోచించి ఉండవచ్చు. ఇందుకు భిన్నంగా పౌలు, "ఆత్మసంబంధులైన" మనుషుల్లాగా వారు లేరని నొక్కి చెప్పాడు. వారు "శరీర సంబంధులైన మనుష్యులే", కేవలం "క్రీస్తునందు పసిబిడ్డలే" (1 కొరింథీ. 3:1). వారిలో ఉన్న "అసూయయు కలహము" వారి ఆధ్యాత్మిక అపరిపక్వతను రుజువు చేస్తున్నాయి (1 కొరింథీ. 2:3). "వారు ఒకరిమీద ఒకరు ఉప్పొంగుతూ" (విజృంభిస్తూ) అధికభావం చూపుకున్నారు (1 కొరింథీ. 4:6).

అపొస్తలుడు దేవుని పిల్లలైన వీరికి ఆత్మసంబంధమైన పితరుల గురించి ఒక విషయాన్ని జ్ఞాపకం చేయాలనుకున్నాడు. అది, "మన పితరులందరు మేఘము క్రింద నుండిరి. వారందరును సముద్రములో నడచిపోయిరి; అందరును మోషేను బట్టి మేఘములోను సముద్రములోను బాప్తిస్మము పొందిరి" (1 కొరింథీ. 10:1, 2). పౌలు ఇంకా వారి గురించి, "అందరు ఆత్మసంబంధమైన ఒకే ఆహారమును

భుజించిరి; అందరు ఆత్మసంబంధమైన ఒకే పానీయమును పానము చేసిరి. ఏలయనగా తమ్మును వెంబడించిన ఆత్మసంబంధ మైన బండలోనిది త్రాగిరి; ఆ బండ క్రీస్తే" (1 కొరింథీ. 10:3, 4). అయినా ఇశ్రాయేలీయులు దేవునికి ఇష్టమైన వారు కాలేకపోయారని జ్ఞాపకం చేస్తూ మరొకసారి పౌలు కొరింథీయులకు ఉపదేశపూర్వకంగా హెచ్చరిక చేశాడు: "అయితే వారిలో ఎక్కువమంది దేవునికిష్టులుగా ఉండకపోయిరి గనుక అరణ్యములో సంహరింపబడిరి. వారు ఆశించిన ప్రకారము మనము చెడ్డవాటిని ఆశించకుండునట్లు ఈ సంగతులు మనకు దృష్టాంతములుగా ఉన్నవి" (1 కొరింథీ.10:5, 6). అరణ్యంలో ఇశ్రాయేలీయులున్నట్లుగా వారితో కొరింథీయులు పోటీపడ కూడదని, వారు "పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెను" (1 కొరింథీ. 10:12) అని చివరగా పౌలు వారిని హెచ్చరించాడు.

అబ్రాహాము లోటుపాట్లు (పాపం) నేడు మనం ఏం చేయకూడదో చెబుతున్నాయి. "మీరెవరిని ప్రేమించి పోషించి సంరక్షించాలో వారిని విస్మరిస్తూ,మిమ్మల్ని మీరు కాపాడుకొనాలనుకొనే స్వార్థచింతన వీడండి, అసత్యాలు వంచనలతో వలలు అల్లకండి" అనేదే దేవుని వాక్యంయొక్క సారాంశం.

---

సూచనలు

[1]Kenneth A. Mathews, *Genesis 11:27–50:26*, The New American Commentary, vol. 1B (Nashville: Broadman & Holman Publishers, 2005), 109. [2]Gordon J. Wenham, *Genesis 1–15*, Word Biblical Commentary, vol. 1 (Waco, Tex.: Word Books, 1987), 274. [3]12:2లో NASB ఈ హెబ్రీ మాటకు అక్షరార్థ అర్థమునిస్తుంది: "నీవు ఆశీర్వాదముగా నుందువు." అయితే, చాలా అనువాదములు, వ్యాఖ్యలు, మరియు సూచనలు ఈ కథనం ఆజ్ఞ అని సూచించవు. [4]హెబ్రీలో ఇదే పదం (עֶבֶד, *'ebed*) యొక్క అర్థం "పనివాడు" లేక "బానిస"; అయితే, పై సందర్భంలో ఇది బానిసలను సంబోధిస్తునట్లు అనిపిస్తుంది, ఎందుకంటే 14:14లోని అబ్రాహాము యొక్క 318 మంది యుద్ధము చేయు పురుషులు "తన గ్రహములో జన్మించెనని" చెప్పబడినది. [5]అబ్రాహాము యొద్ద పశువుల కాపరులు–యుద్ధ వీరులైన దాసులు/బానిసల పెద్ద జట్టు ఉన్నది కాబట్టి (14:14), భార్యలు మరియు పిల్లలతో సహా, వెయ్యిమంది ప్రజలు ఆ బృందములో ఉన్నారని సాధారణ అంచనా. [6]హారాను నుండి కనాను మధ్య యాత్రలో ఉన్న ధమస్కులో తన దాసుడైన, ధమస్కుకు వాడైన ఎలియాజరును (15:2) అబ్రాహాము పొందియుండవచ్చు. [7]క్రొత్త నిబంధన కాలములో, సికారు పురాతన స్థలమైన షెకెము యొద్ద గుర్తించబడెను (యోహాను 4:5). నేడు, ఈ ప్రాంతంలో నబ్లుస్ పట్టణం ఉంది. [8]ఇదే హెబ్రీ బహువచన వ్యక్తీకరణ ద్వితి. 11:30లో కూడ ఉపయోగించబడెను: "మోరేలోని సింధూర వృక్షములు." [9]దేవుడు ఇంతకు ముందు కూడ హారానులో అబ్రాహాముతో మాట్లాడెను (12:1, 4), కాని ఎలాంటి ప్రత్యక్షతను ప్రస్తావించలేదు. [10]13:15, 16; 15:18; 17:7–10, 12, 19; 22:17, 18; 24:7; 26:3; 28:4, 13 చూడండి.

[11]పితరుల ద్వారా అనేక బలిపీఠములు కట్టబడెను: షెకెములో (12:7), బేతేలులో (12:8), హెబ్రోనులో (13:18), మరియు మోరీయా పర్వతము నందు అబ్రాహాము (22:9); బెయేర్షెబాలో ఇస్సాకు (26:25); మరియు షెకెము (33:20) మరియు బెతేలులో (35:7) యాకోబు. [12]హాయి పట్టణం యొక్క గుర్తింపును గూర్చిన చర్చ కొరకు, చూడండి R. K. Harrison, "Ai," in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1979), 1:81–84. [13]కరువు/అనావృష్టిని తప్పించుకొనుటకు ప్రజలు ఐగుప్తునకు వెళ్లిరని బైబిల్ వెలుపల ఉన్న పురాతన గ్రంథములు చెప్పుచున్నవి. ఉదాహరణకు, ఏదోముకు చెందిన బెడౌన్ గోత్రం వారికి "వారిని వారి పశువులను బ్రతికించుకొనుటకు" ఐగుప్తులో ఉన్న నీటి కొలనులకు వెళ్ళే అనుమతి ఉండేదని ఐగుప్తు లేఖ ఒకటి తెలియజేస్తుంది. (John A. Wilson, trans., "The Report of a Frontier Official," in *Ancient Near Eastern Texts: Relating to the Old Testament*, 3d ed., ed. James B. Pritchard [Princeton, N.J.: Princeton University Press, 1969], 259.) [14]అబ్రాహాము హారానును విడచినప్పుడు అతని వయస్సు డెబ్బై ఐదు సంవత్సరములు (12:4), మరియు శారా అతని కంటె పది సంవత్సరాలు చిన్నది (17:17). [15]ఐగుప్తు భాషలో, "ఫరో" అను పదమునకు అసలు అర్థము "గొప్ప ఇల్లు," ఇది రాజు గృహమును సూచిస్తుంది. కాలక్రమేనా, ఇది రాజు యొక్క బిరుదుగా మారింది. [16]ఈ మొత్తమును "పెండ్లి కుమార్తె వెల"గా గ్రహించాలి (מֹהַר, *mohar*) (34:11, 12; నిర్గమ. 22:16; 1 సమూ. 18:22–27 చూడండి). శారా యొక్క తండ్రి అయిన తెరహు మరణించెను గనుక, ఆ మొత్తమును అతని సోదరుడు అబ్రాహాముకు చెల్లించెను. Since Sarah's father Terah was no longer living (11:32), the bride price was paid to her brother Abraham. [17]కరువు కారణంగా అబ్రాహాము కనానును విడచి ఐగుప్తునకు వెళ్లవలసియుంటే, లోతు మరియు అతనితో కూడ ఉన్న ప్రజలు, జంతువులు కూడ, ఆహారం మరియు నీరు కొరకు ఆయనతో వెళ్లవలసియున్నది. [18]Juris Zarins, "Camel," in *The Anchor Bible Dictionary,* ed. David Noel Freedman (New York: Doubleday, 1992), 1:825–26. [19]2 రాజులు 15:5లో nega'యొక్క క్రియా రూపము ఉపయోగించబడెను, ఇది "ప్రభువు రాజును కొట్టెను" అని వ్యాఖ్యానించెను (వక్కాణం జోడించబడెను). [20]అయితే, ఇలాంటి పరిస్థితిలోనే ఆయన స్పందన 20:11–13లో వ్రాయబడినది.

[21]Gerhard Friedrich, "εὐαγγελίζομαι," in *Theological Dictionary of the New Testament*, trans. and ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1964), 2:707–8. [22]బైబిల్లోని ప్రముఖ వ్యక్తులు తమ పాత జీవితాన్ని విడిచిపెట్టి అపాయకరమైన పరిస్థితుల్లోనికి వెళ్లడానికి గాను యెహోవా తన ప్రత్యక్షత (దైవసాక్షాత్కారం) ద్వారా తనగురించి వెల్లడి చేసుకొని వారిని పిలిచాడు. ముఖ్యమైన ఉదాహరణలు: మోషే (నిర్గమ. 3:1–4:17), యెషయా (యెష. 6:1–13), మరియు తార్సు పట్టణస్థుడైన సౌలు (అపొ. 9:3–20). [23]ప్రాచీన కాలంలో షెకెములో క్రీ.పూ. 4500 నాటికే ఆదిమకాలపు నివాస స్థావరాలుండేవని, దాదాపుగా అబ్రాహాము కాలంనాటికి అక్కడ విస్తార స్థాయిలో క్రమబద్ధానుసారమైన సామాజిక జీవనం ఉండేదని పురావస్తు శాస్త్రజ్ఞుల అన్వేషణ. చూడండి Lawrence E. Toombs, "Shechem (Place)," in *The Anchor Bible Dictionary*, ed. David Noel Freedman (New York: Doubleday, 1992), 5:1178–79. [24]1 రాజులు 18:16–19:18 లోని ఏలియా అనుభవాలతో పోల్చి చూడండి. [25]అబ్రాహాములో ఇటువంటి వైఖరి కనిపించిన దృష్టాంతాలు

ఆదికాండములో ఉన్నాయి: దమస్కు ఎలియాజరును తన వారసుడిగా దత్తత తీసుకొనడానికి ప్రయత్నించడం (15:2–4); శారా దాసియైన హాగరు ద్వారా సంతానం పొందడానికి ఒప్పుకొనడం (16:1–4) మొదలైనవి. మరొక సందర్భం: అబ్రాహాము నవ్వి, శారా తన వృద్ధాప్యంలో పిల్లల్ని కనగలదా అని తన మనసులో అనుకొని ఇష్మాయేలును వాగ్దానం విషయంలో తనకు వారసుడిగా అనుమతించమని దేవుణ్ణి వేడుకొనడం (17:15–18). చివరగా, ఐగుప్తులో జరిగినట్టుగానే గెరారు రాజుతో కూడా అతను శారా తన సహోదరి అని చెప్పినప్పుడు అతనిలో ఈ వైఖరి కనిపించింది (20:1, 2).